ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మార్చి 08, 2015

అపురూప కళాఖండం
'బంగారు పాప'



అతని ప్రపంచంలో ఆమె

సంజన

నిక్కీ

నేహా శర్మ

ఐషా శర్మ

సినీ సిస్టర్స్

కాజల్

నిషా

అక్కాచెల్లెళ్లు తెలుగు సినిమాల్లో నటించడం కొత్తేమీ కాదు. టాబూ-ఫరా, నగ్మా-జ్యోతిక, అంబిక-రాధ, రాధిక-నిరోషా, కాజల్-నిషా అగర్వాల్ ఆ కోవకు చెందిన వారే. అయితే తాజాగా తెర మీదకు వచ్చిన సిస్టర్లు... సంజన-నిక్కి, శ్రీరమ్య-శ్రీదివ్య, నేహ శర్మ-ఐషా శర్మ. సునీల్ హీరోగా చేస్తున్న చిత్రం ద్వారా సంజన చెల్లెలు నిక్కి అరంగేట్రం చేస్తోంది. 'నేను కొత్తగా చిత్ర పరిశ్రమలోకి వచ్చినప్పుడు నాకు ఏమీ తెలీదు. ఒకరకంగా పోరాటమే చేశాననుకోవాలి. అయితే నా చెల్లెలు నిక్కికి మొదట్లోనే మంచి మద్దతు లభించింది. మిత్రుల నుంచి మంచి సహకారం వుంది' అంటోంది సంజన. చిట్టి చెల్లెలు సినిమాల్లోకి రావడం వల్ల పోటీ పెరుగుతుందని మాత్రం అనుకోవడంలేదు. 2008లో అవార్డు పొందిన చిత్రం '1940లో ఒక గ్రామం' ద్వారా తెరకు పరిచయమైంది శ్రీరమ్య. అందులో తన పాత్ర సహజంగా కనిపించడం కోసం గుండు కూడా చేయించుకుంది. వెంట్రుకలు పెరగడానికి ఏడాది పట్టడంతో అప్పటి వరకు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చిందట. ఆమె చెల్లెలు శ్రీ దివ్య 'బస్ స్టాప్' సినిమాతో టాలీవుడ్‌లో అడుగెట్టి... ఇప్పుడు తమిళ చిత్రసీమలో మాంచి డిమాండ్ సంపాదించుకుంది. రామ్ చరణ్ 'చిరుత'తో తెలుగు సినీరంగానికి పరిచయమైన నేహా శర్మ ఇప్పుడు బాలీవుడ్‌లో బిజీగా వుంది. ఆమె సోదరి ఐషా ఇప్పుడు రామ్ జోడీగా తెలుగు తెరమీద మెరవనుంది. "నటనాపరంగా ఎటువంటి శిక్షణ లేకుండానే సినిమాల్లోకి వచ్చేశాను. కానీ నా చెల్లెలు అలా కాదు, ఆమెకు అన్నీ తెలుసు. తనకు ఎప్పుడు సాయం కావాలన్నా నేను సిద్ధంగా వుంటాను" అంటోంది నేహా. సో...సిస్టర్స్ ఒకరికొకరు సహకరించుకుంటూ ఆ విధంగా ముందుకు పోతున్నారన్నమాట. •

శ్రీ దివ్య

శ్రీరమ్య

స్నేహ ప్రజాశక్తి

snehaweekly.praja@gmail.com

మరపు ముచ్చట

మరుపు లేని మనిషి వుంటాడా?! టార్చిలైటు వేసి వెతికినా దొరకక పోవచ్చు. ఒకవేళ ఎవరైనా... 'నేను ఇప్పటి వరకు ఏదీ మర్చిపోలేదు!' అనంటే వారి నిజాయితీని శంకించాల్సిందే. ఎందుకంటే మరుపు అంత సహజం. రకరకాల పనుల్లో పడిపోయి ముఖ్యమైన వాటిని కూడా మర్చిపోతుంటాం కొన్నిసార్లు. అనుక్షణం ఉపయోగించే కళ్లజోడు ఎక్కడ పెట్టేది గుర్తుండదు. బండి తాళం ఎక్కడ తగిలించామో జ్ఞాపకం వుండదు.

అయితే ఈ మరుపులో కూడా రకాలున్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. సహజ సిద్ధంగా వచ్చేది ఒకటైతే ... ప్రత్యేకంగా కొన్నింటిని మాత్రమే మర్చిపోవడం మరొకటి. దీన్నే 'సెలక్టివ్ ఆమ్నీషియా' అంటారు. ఇలా ఎన్నయినా చెప్పకోవచ్చు.

వయసు పైబడ్డవాళ్లకు సహజంగానే మరుపు వచ్చేస్తుంది. గతమే కాదు. ఇప్పటికిప్పుడు చేసిన పనులు కూడా గుర్తుకు రావు. ఏ వస్తువు ఎక్కడ పెట్టిందీ మర్చిపోతుంటారు. అందుకే వెనక ఎవరో ఒకరుండి వారికి అన్నీ అమర్చుతుంటారు.

మరుపు బడికెళ్లే పిల్లలకూ వుంటుంది. పాపం రాత్రింబగళ్లు కష్టపడి చదువుతారు. తీరా మాష్టారు నిలబెట్టి అడిగితే నోరు వెళ్లబెట్టేస్తారు. భయంతో బిగుసుకుపోతారు తప్ప నోరు తెరచి చెప్పరు. అదే సినిమాల గురించో, క్రికెట్ గురించో అడిగి చూడండి. టప టపా చెప్పేస్తారు. ఎందుకంటే అవంటే వారికి ఇష్టం.ఇష్టపడి చేసే ప్రతిది గుర్తుంటుంది. అదే చదువు విషయానికొచ్చేసరికి కష్టంగా ఫీలవుతారు. అందుకే పరీక్షల్లో చదివినవి కూడా మర్చిపోయి శ్వేతపత్రాలు ఇచ్చి వస్తుంటారు.

ఇష్టం లేని వాటిని కావాలని మర్చపోయే కోవకు చెందిన వారూ కనిపిస్తుంటారు. ఎవరైనా అప్పు అడిగితే 'అర్రే...! ఎవరో ఏదో అడిగారనుకుంటున్నా కానీ ఆ విషయమే మర్చిపోయానోయ్...రేపు ఓ సారి ఇంటికొచ్చి కనపడు. ఆలోచిద్దాం' అంటుంటారు. అప్పు తీసుకున్నవాళ్లు కూడా ఇలాగే మర్చిపోయినట్టు నటించడం మామూలే. ఇక చదివి ఇచ్చేస్తామని పుస్తకాలు తీసుకెళ్లిన వాళ్ల మరపు గురించి ఎంత చెప్పకున్నా తక్కువే. 'బుక్ ఎప్పడో చదివేశానండీ. మీకు ఇద్దామని ముందు గదిలో టీపాయ్ మీద కూడా పెట్టాను. కానీ తేవడమే మర్చిపోయాను' అనేస్తారు (పుస్తకం తిరిగి ఇవ్వడం ఇష్టం లేక)! ఇక కాఫీ పొడి, పంచదార చేబదులు తీసుకెళ్లే ఇరుగుపొరుగు మరపు సంగతులు అన్నా ఇన్నా.

రాజకీయ నాయకులకున్నంత మరుపు మరెవరికీ వుండదు. మరీ ముఖ్యంగా వీరిది 'సెలక్టివ్ ఆమ్నీషియా'. ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేస్తారు. హామీలు గుప్పించేస్తారు. గద్దె మీద కూర్చోబెడితే అరిచేతిలో వైకుంఠం చూయిస్తామంటారు. తీరా గెలిపించాక...పీఠం మీద కూర్చోబెట్టాక...ఆ వాగ్దానాలన్నీ మర్చిపోతారు. 'అలా అన్నామా...అయినా ఎన్నికల్లో ఎన్నో అంటుంటాం. అన్నీ చేసేస్తామా' అన్నట్టు నోరు తెరిస్తే ఒట్టు. ఒకవేళ పొరబాటున ఏదైనా చేసినా వారికి 'ఉపయోగ'పడుతుందీ అనుకుంటేనే చేస్తారు.
కొన్నిటిని మాత్రమే మర్చిపోవడం నేతలకేనా! ఓటర్లకూ వుంటుంది! ఆ దెబ్బకు పాపం మతిమరపు నేతల డిపాజిట్లు గల్లంతయినా ఆశ్చర్యం లేదు. ■

◆ మనలో మాట



టపా

అమెరికా ముద్ర

ఫిబ్రవరి 22 స్నేహలో ప్రచురించిన "ఆస్కార్ ఎవరిది?" అట్టమీది కథ ఆకట్టుకుంది. ఈ సారి తెల్లవారికి మాత్రమే స్థానం లభించడం ఆస్కార్ జ్యూరీలో చూపుతున్న వివక్షను అర్థం చేసుకోవచ్చు. కుటుంబ విలువలు, అందరూ చూడదగ్గ చిత్రం "ఆర్టిస్ట్", నల్లజాతీయులపై జరిగిన అణచివేత కథనంతో తెరకెక్కిన "సెల్మా" చిత్రాలు రెండూ ఆస్కార్ నామినీకి తీసుకోలేదు. అమెరికా సామ్రాజ్యవాద ప్రభావం అన్నీ రంగాలపై ఉన్నట్టే, సినిమా రంగంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డు ఆస్కార్‌పై కూడా ఉందనడానికి ఇదే ఉదాహరణ.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ

కథ బాగుంది

బహుభాషా 'దృశ్యం' ఆకర్షణీయంగా ఉంది. ఇది కుటుంబ కథా చిత్రం. అన్నీ భాషల్లో రావడం మంచిదే. తుదిపలుకులు శీర్షికలో ప్రముఖుల ఆఖరి మాటలు చదువుతుంటే ఆశ్చర్యంతో పాటు, ఆదర్శంగానూ అనిపించాయి. చివరి వరకూ సమాజ శ్రేయస్సు కోసమే జీవించిన టాల్‌స్టాయ్, ఐన్‌స్టీన్ వంటి వ్యక్తుల తుదిపలుకులు ఈ శీర్షికకు మరింత అందాన్ని చేకూర్చాయి. "నేనూ – శబరి" కథ బాగుంది. పురుషాధిఖ్య సమాజంలో భర్త చనిపోయిన స్త్రీని ఎలా చూస్తారు...గతంలో ఎలా చూసారు...కొంచెం పరిస్థితులు మారినా ఇంకా వాటి ఆనవాళ్లు నేటి ఆధునిక సమాజంలో ఎలా పాతుకుపోయాయి అన్న విషయాన్ని రచయిత చక్కగా కథీకరించారు.

నెమాని సుభాష్‌చంద్ర బోస్, విశాఖ

(మెయిల్ ద్వారా)

నిజాయితీకి మచ్చుతునక

"యువ" శీర్షికలో మీరు చేసేది సరైన పనే లెనిన్ జీవితంలోని సంఘటనను తెలియజేశారు. లెనిన్ జీవితం భావితరాలకు ఆదర్శం. ఆయన ఎంత మేధావి అయినప్పటికీ సామాన్యులకు సైతం ఎంత దగ్గరగా ఉండేవారో ఈ శీర్షికలోని కథనం చదువుతుంటే తెలిస్తుంది. వారికి సాయం చేయడం మాత్రమే కాదు, వారు ఇచ్చిన కానుకని తిరస్కరించడం ఆయన నిజాయితీకి మచ్చుతునక. "కోల్పోయింది కాలు మాత్రమే...ఆత్మస్థైర్యాన్ని కాదు" అంటున్న కిరణ్ కనోజియా కృషిచ పట్టుదల అభినందనీయం. పుట్టిన రోజునాడే కాలును పోగొట్టుకోవడం దురదృష్టకరం. ఆఖరిన ఆమె చెప్పిన మాట ప్రతి ఒక్కరూ వారి అవయవాలను కాపాడుకోవాలి. అవి ప్రకృతి ఇచ్చిన వరం ఆ మాటలు స్ఫూర్తిదాయకంగా అనిపించాయి.

కుక్కల రఘుబాబు, తిరుపతి

వారి చేతుల్లో ఏముంది

బ్రహ్మానందం ఇంటర్వ్యూ బాగుంది. అశ్లీల, అసభ్య డైలాగులు పలకడం నాకూ బాధే అని చెప్పారు. దర్శక, నిర్మాతల అభీష్టం ప్రకారం నడుచుకునే వారే నటులు. వారి చేతుల్లో ఏమీ ఉండదు. ఆయన చెప్పినట్టు డైలాగులు మార్చమంటే, ఆయన్నే మారుస్తారు. ఈ మార్పు అనేది వ్యవస్థాగతంగా రావాలి. మంచి దర్శకులు, రచయితలు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించే వారు సినీ పరిశ్రమకు అవసరం. అడిగో పుల చిత్రమాలిక కవితలో పండుటాకుల జీవితాన్ని స్పృశించాడు కవి. "రుచి"లో మిగిలిన అన్నంతో రకరకాల ఐటమ్స్ చేసే విధానాన్ని చెప్పటం బాగుంది. ప్రేమ విప్లవం సీరియల్ ప్రతివారం చదువుతున్నాం. మార్క్స్, ఎంగెల్స్ కృషి, త్యాగాలు అనిర్వచనీయం. ఈ సీరియల్ అంతటినీ పుస్తక రూపంలో తీసుకువస్తే పాఠకులకు ఇదొక మంచి కానుక అవుతుంది

చేబ్రోలు పద్మజ, టంగుటూరు, ప్రకాశం జిల్లా

ఈ సంచికలో....

అతని ప్రపంచంలో ఆమె

కవర్‌స్టోరీ 14

నాన్న కుర్చీలో కూర్చొని దర్జాగా కాలుమీద కాలువేసుకొని దినపత్రిక చదువు తుంటాడు. అమ్మ కాఫీ అందిస్తుంటుంది. ఇది సహజంగా సినిమాల్లోనూ, కథల్లోనూ మనకు తారసపడే సన్నివేశం. కానీ ఇది ఒకప్పటి మాట. కాలం మారింది. ఇప్పుడు వంట గది అమ్మది మాత్రమే కాదు, నాన్నది కూడా. అలాగే కేవలం పురుష కేంద్రాలుగా ఉన్న కొన్ని రంగాల్లో సైతం మహిళలు ప్రవేశించి అద్భుతమైన ప్రతిభను చాటుతున్నారన్నది నేటి మాట. తరతరాల పురుషాధిఖ్య సమాజం పోకడలను పెకిలించి వేసి అన్నింటా తానవుతున్న అతివలు నేడు మన కళ్లముందు చాలా మందే కనిపిస్తుంటారు.

కళ 3
పది నిమిషాల్లో గీసేస్తాడు

స్ఫూర్తి 4
ఆత్మ సౌందర్యంతో ముందడుగు

వింతలోకం 5
మిడత తెలివి

కథ 6
బోరు బండ

నవ్వుల్ - పువ్వుల్ 8

యువ 9
అమ్మని ఆఖరి చూపు చూడనివ్వలేదు

ప్రత్యేకం 10
నిత్య సృజనశీలి అనూప్

ప్రయాణం 11
క్యాన్సర్ అవగాహన కోసం

చెత్త నుంచి కంప్యూటర్లు 12

సినిమా కబుర్లు 13
అపురూప కళాఖండం బంగారుపాప

సీరియల్ 18
ప్రేమ - విప్లవం

రుచి 21
చల్ల చల్లని సలాడ్స్

బాలనేస్తాలు 22
నచ్చిన రంగుల్లో ఐస్ క్రీం

కొత్త పుస్తకాలు 24

చిత్రలేఖనం ఒక కళ. అందులోనూ మనిషిని నిల్చోబెట్టి ఐదు లేక పది నిమిషాల్లో ఆ వ్యక్తి ముఖచిత్రం గీయడమన్నది అంత సులభమేం కాదు. ఇది చిత్రకారులందరికీ అబ్బే కళా కాదు. కేవలం కొంత మంది మాత్రమే పోర్ట్రరేట్స్‌పై ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంటారు. వారు మాత్రమే ముఖచిత్రాలను అచ్చుదించగలరు. అలాంటి వారిలో ఒకరు **కొలుకులూరి శివప్రసాద్.** పిల్లల కథలకూ చక్కటి బొమ్మలు గీయడం శివ ప్రత్యేకత. చిత్రకళే జీవితంగా బతుకుతున్న ఈ యువ చిత్రకారుడి మనోగతాన్ని తెలుసుకుందాం!

◆ కళ

పది నిమిషాల్లో గీసేస్తాడు

చిన్నప్పటి నుండి బొమ్మలు గీయడం అంటే అమితమైన ఆసక్తి శివకు. తల్లిదండ్రులేమో వ్యవసాయ కూలీలు. స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లాలోని పొలమూరు గ్రామం. ఇంటర్ వరకూ కష్టమో నష్టమో తండ్రే చదివించాడు. తర్వాత కుటుంబ పరిస్థితులు అర్థం చేసుకున్న తను రైస్ మిల్లులో గుమా స్తాగా పనిచేస్తూ డిగ్రీలో చేరాడు. ఖాళీ సమయాల్లో పత్రికల్లో ప్రచురితమైన సినీ ప్రముఖులు, క్రీడాకారుల చిత్రాలు గీస్తుండేవాడు. అవి చూసిన మిత్రులు, సన్నిహితులు శివను మెచ్చుకునేవారు. ఒకరోజు ఆ కళాశాల పర్యవేక్షణకు వచ్చిన విద్యాశాఖ అధికారి శివ బొమ్మలు చూసి అచ్చెరువొంది, "నా బొమ్మ గీయగలవా అని అడిగాడు. తడుముకోకుండా వెంటనే పేపర్‌పై పది నిమిషాల్లో ఆ అధికారి బొమ్మను గీశాడు శివ. పేపర్‌పై తన ముఖచిత్రాన్ని చూసుకున్న ఆయన ఉబ్బితబ్బిబ్బయాడు. ఫైన్ ఆర్ట్స్ కోర్సు చేయమని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత ఓసారి దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ సందర్శనకు వెళ్లాడు శివ. అక్కడి కళాఖండాలు తన మనస్సులో చెరగని ముద్రవేశాయి. చిత్రకారుడిగానే బ్రతకాలన్న సంకల్పాన్ని నాటాయి.

ఆయన శభాష్ అన్నాడు

డిగ్రీ పూర్తిఅయిన తర్వాత హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రవేశ పరీక్ష రాశాడు. సీటు వచ్చింది. ఫీజు కట్టే స్తోమత లేదు. "బొమ్మలు అవి మనకు ఎందుకు. అవేమన్నా కూడు బెడతాయా" అని నిష్ఠూరమాడాడు తండ్రి. ఆనోటా ఈ నోటా శివ గురించి తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన సుభాషిణి అనే ఆమె శివను చదివించడానికి ముందుకొచ్చారు. ఆర్థిక సహాయం అందించారు. అనుకున్నట్టుగానే హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చేరాడు. ఫీజుల వరకూ దాతలపై ఆధారపడటం సబబే. కానీ ప్రతి నెలా బతకడానికి ఎలా అని ఆలోచించాడు. ఒక మిత్రుడు సలహా మేరకు శిల్పారామంలో శని, ఆదివారాలు అక్కడికి వచ్చే సందర్శకుల ముఖచిత్రాలు గీయడం ప్రారంభించాడు. అంతేకాదు ఆర్భాటంగా జరిగే వివాహ, పుట్టిన రోజు వేడుకలకి విచ్చేసే అతిథుల్ని ఆకర్షించడం కోసం పోర్ట్రరేట్ స్టాల్స్ పెడతారు కొందరు. వచ్చిన అతిథుల చిత్రాలు గీస్తారు వీరు. అందుకు కొంత డబ్బు కూడా చెల్లిస్తారు. ఆ ఈవెంట్స్‌లో కూడా తరచూ పాల్గొనేవాడు శివప్రసాద్. అలాంటి ఒక వేడుకకు సినీ నటుడు మురళీ మోహన్ వచ్చారు. నా చిత్రం గీస్తావా అని అడిగారు తనని. నాలుగు నిమిషాల్లో మురళీ మోహన్ ముఖచిత్రం పూర్తయింది. శివ కళా నైపుణ్యం చూసి ఆశ్చర్యపోయిన మురళి మోహన్ శభాష్ అని మెచ్చుకోవడమే కాదు....శివతో ఫొటో కూడా దిగాడు. అందరూ ఆయనతో ఫొటో దిగాలని ఆరాటపడతారైతే, ఆయన మాత్రం ఇతనితో ఫొటో దిగాలని కోరడం....బహుశా కళకున్న ప్రత్యేకత అదేనేమో.

పిల్లల బొమ్మలు ప్రత్యేకం

ఆసక్తితో మొదలైన విద్య బతుకు దారిని చూపించింది. నాలుగుసంవత్సరాల కోర్సు పూర్తయింది. యాడ్ ఏజన్సీలో రెండంకెల జీతంతో మంచి అవకాశం వచ్చింది. కానీ అవేవీ శివకు తృప్తి కలిగించలేదు. కారణం డబ్బు కాదు...అక్కడ తను చేసే పని ముఖ్యం. కళ, కళ కోసం కాదు..సమాజం కోసం అన్న శ్రీ శ్రీ మాటలే తనకు ఆదర్శం. "నా దృష్టిలో బతకడం సమస్య కాదు. ఎలా బతికామన్నదే ముఖ్యం. నాకు పిల్లలంటే అమితమైన ఇష్టం. వారికి డ్రాయింగ్ నేర్పించాలని ఇంకా ఇష్టం. అందుకే పిల్లలు ఎలాంటి బొమ్మల్ని ఇష్టపడతారు. వారికి ఎలాంటి బొమ్మల ద్వారా మంచిని తెలియచేయవచ్చు అనే విషయాల గురించి నా మటుకు నేను చాలా నోట్స్ తయారుచేసుకున్నాను. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల ఆటలు, సరదాలు వారి జీవన విధానం అన్నింటినీ బొమ్మల్లో పొందుపరిచాను. కొన్ని పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు పిల్లలకోసం ముద్రించే కథల పుస్తకాలకు ఇల్యుస్ట్రేషన్స్ కూడా గీస్తుంటాను. ఇప్పుడు మాన్యువల్ వర్క్స్ చేసే చిత్రకారులు తక్కువయ్యారు. కారణం తగిన ప్రోత్సాహం లేక. ప్రభుత్వం డ్రాయింగ్ టీచర్ పోస్ట్‌లను తొలగించింది. ప్రభుత్వమే కళలను చిన్నచూపు చూస్తే...ఇక సామాన్యుల్లో కూడా అదే భావన ఉండటం సాధారణమే కదా! పోర్ట్రరేట్ వేసేవారూ అరుదుగానే కనబడతారు. కారణం వారికి తగిన గుర్తింపులేకపోవడం. నేను ఇప్పటి వరకూ సుమారు ఐదు వేల మంది ముఖచిత్రాలు గీసుంటాను. వారిలో కొంతమంది మాత్రమే మా కళను...గుర్తించేవారు. మిగతావారు వారి బొమ్మని మాత్రమే చూసుకుంటారు. మాకు కావాల్సింది గుర్తింపు అంటే పొగడ్తల్లో...బహుమతులలో కాదు... అవకాశాలు. ఆర్ట్‌కి విలువ ఇవ్వడం. సమాజాన్ని రేపటి తరాలకు ప్రతిబింబించేవి కళలే. అలాంటి కళలకు ఆదరణ లేకపోవడం దురదృష్టం" అంటాడు ఈ యువ చిత్రకారుడు శివప్రసాద్.



- కారుసాల అనిత

ఆత్మసౌందర్యంతో ముందడుగు

◆ స్ఫూర్తి

మోడలింగ్, ఫ్యాషన్ షూట్ అంటే ఎంత హడావిడి వుంటుంది? కళ్లు చెదిరిపోయే లైట్ల వెలుగులు... అందమైన మోడళ్లు... డిజైనర్లు తయారు చేసిన బట్టలు... క్లిక్ మనిపించే కెమెరాలు.... ఒక్క క్షణం కూడా విడిచి పెట్టకుండా షూట్ చేసే వీడియోలు....ఇవే గుర్తొస్తాయి ఎవరికైనా. అందుకు భిన్నంగా యాసిడ్ దాడికి గురైన అమ్మాయిలు ఫొటో షూట్‌లో పాల్గొంటే... అన్న ఆలోచన ఫలితమే ఈ ఫొటోలు. అంతగా ఆకట్టుకోలేని ఈ ఫొటోల వెనక దాగిన జీవన కఠోర సత్యాలేంటో చూద్దాం.

లక్ష్మి రీతు రూప

రూప, లక్ష్మి, రీతు, సోనమ్, చంచల్! నలుగురూ యాసిడ్ దాడికిగురైన వారే. వీరితో ఫొటోషూట్ చేయాలన్న ఆలోచన వచ్చింది మాత్రం ఓ ఫొటోగ్రాఫర్‌కు. అతనే రాహుల్ శహరన్. ఓసారి చావోన్ అనే స్వచ్ఛంద సంస్థలో రూపను చూశాడు. ఆమెను చూశాక... ఆమె గతం గురించి విన్నాక...అలాంటి వారితో ఫొటోషూట్ చేస్తే ఎలా వుంటుంది? అన్న ఆలోచన వచ్చిందతనికి. అలా ఆ నలుగురిని సమీకరించాడు. వీరి కథలు వింటుంటే మనసు ద్రవించకుండా వుండదు. అంత దయనీయంగా వుంటాయి.

రూపకు ఎవరో అన్యాయం చేయలేదు. సొంత కుటుంబీకుల నుంచే ఆమెకు రక్షణ కరవైంది. సవతి తల్లికి ఆమె పెళ్లికోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం ఇష్టంలేదు. అందుకు ఆమె ఎంచుకున్న మార్గం యాసిడ్ దాడి. అలా అనాకారిని చేసి ... కలలోకూడా కళ్యాణం చేసుకోవాలన్న ఆలోచనే రాకుండా చేసేసింది. పైగా తండ్రి నుంచి కూడా ఆమెకు ఎలాంటి సానుభూతి, మద్దతు లేకపోవడంతో ఇల్లు విడిచిపెట్టి వచ్చేసింది. చవోన్ అనే స్వచ్ఛంద సంస్థ సాయంతో తనకెంతో ప్రీతి పాత్రమైన డ్రెస్ డిజైనర్‌గా కొత్త జీవితాన్ని ఆరంభించింది.



రాహుల్ ,లక్ష్మి

లక్ష్మికి అప్పుడు పదహారేళ్లుంటాయేమో! ముప్పై ఏళ్ల వాడు ఆమె వెంట పడేవాడు ప్రేమిస్తున్నానంటూ. తనకా ఆలోచన లేదని, చదువుకోవాలనుకుంటున్నానని చెప్పింది లక్ష్మి. తిరస్కారాన్ని జీర్ణించుకోలేని అతను ఆమె మీద యాసిడ్ పోసేశాడు.

రీతుది కూడా ఇలాంటి కథే. అయినవాళ్లే ఆమె మీద యాసిడ్ దాడికి తెగ బడ్డారు. ఆస్తి సమస్యకు ఇదే పరిష్కారంగా తోచింది వారికి. ఆస్తికి, యాసిడ్ దాడికి ఏంటి సంబంధం అంటే ఏమీ వుండదు. అంతా మతిలేని తనం. మూర్ఖత్వం. రాక్షసత్వం. అంతే.

సోనమ్, చంచల్ అక్కాచెల్లెళ్లు. జులాయిలెవరో వారిని ఏడిపించేవారు. అయితే దాన్ని ఏమాత్రం సహించ లేదు సరికదా! వారి ఉన్మాద చేష్టలకు అడ్డుకట్ట వేయడానికై ఎదురు తిరిగారు. తమకే ఎదురు తిరుగుతారా? అనుకున్న అల్లరి మూక ... అమ్మాయిలిద్దరి మీద యాసిడ్ పోశారు.

వీరంతా 'చవోన్' అనే స్వచ్ఛంద సంస్థ సాయంతో చికిత్స పొందుతూ మానసికంగా, శారీరకంగా అయిన గాయాల నుంచి ఊరడింపు పొందుతున్నారు. సరిగ్గా అప్పుడు వారితో ఫొటో షూట్ చేయాలన్న ఆలోచనను ప్రస్తావించాడు రాహుల్ సహరన్. వంటి మీద ముసుగు లేకుండా నలుగురిలోకి వచ్చి ఎన్నాళ్లైందో వారు. అలాంటిది ఇప్పుడు ఏకంగా జనం ముందర ఫొటో షూట్‌లో పాల్గొనడమంటే మాటలా! కానీ వారంతా సాహసించారు. మనసుల్లో వున్న బాధను, శోకాన్ని, భయాన్ని అన్నిటినీ విడిచిపెట్టేసి కెమెరా ముందుకొచ్చారు.

అంతా చాలా సాదా సీదా బట్టలతో...ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వకుండా సహజ సిద్ధమైన వాతావరణంలో ఫొటో షూట్ చేశాడు రాహుల్. ఎన్నో ఏళ్ల తర్వాత వారి మోములో కనిపించిన చిరునవ్వులను... ఆత్మవిశ్వాసాన్ని... తన కెమెరాలో బంధించి ప్రపంచం ముందుంచాడతను. వీరితో క్యాలెండర్ షూట్ కూడా చేయాలనుకుంటున్నాడు రాకేష్. ◆



చిన్ని చేప

ఎప్పుడైనా 0.33 అంగుళాల చేపను చూశారా! మీ ఎదురుగా కనిపిస్తోందదే. ఇది ప్రపంచంలోకెల్లా చిన్న చేపగా గుర్తింపు పొందింది. అయితే దీన్ని శాస్త్రవేత్తలు పాతిక సంవత్సరాలు ఆలస్యంగా కనుగొన్నారు. వీటికి నోటిలో పళ్లుగానీ, శరీరం మీద పొలుసులుగానీ కనీసం రంగు కూడా వుండదు. అంతేకాదు. ఇవి చాలా తేలికగా వుంటాయి. అంటే దాదాపు అరకిలో బరువుకే ఐదు లక్షల దాకా చేపలు తూగుతాయి. వీటిని స్టౌట్ ఇన్‌ఫాంట్ ఫిష్ అని పిలుస్తారు. వీటిలో అతి పెద్ద ఆడ చేపలు అంగుళంలో మూడో వంతు వుండగా, మగ చేపలు మాత్రం అంగుళంలో నాలుగో వంతు వుంటాయి. వీటి శరీరంలాగే జీవితకాలం కూడా తక్కువే. ఇవి రెండు నెలలు మాత్రమే బతుకుతాయి. అసలు 1979లోనే ఆస్ట్రేలియా తీరంలోని గ్రేట్ బారియర్ రీఫ్ ప్రాంతంలో ఈ చేపలు కనిపించినప్పటికీ దాదాపు రెండు దశాబ్దాల వరకు వాటి గురించి పట్టించుకోలేదు. ఆ తర్వాత ఇది వెన్నెముకగల ప్రాణుల్లో అతి చిన్న ప్రాణి అని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. అయితే మనకు ఒక అనుమానం వస్తుంది. ఇంత చిన్న చేప సముద్రంలో ఎలా బతుకుతోంది? అని. ఆ విషయాన్నే కనిపెట్టాల్సి వుంది.

కోకోనట్ టూర్

ఇంట్లో వాడుకోవడానికి తెచ్చిన కొబ్బరికాయలు ఒక్కోసారి కుళ్లిపోతుంటాయి. కానీ సముద్రంలో పడిన కొబ్బరికాయ మాత్రం సంవత్సరం వరకు జీవశక్తిని కలిగి వుంటుంది. సముద్ర తీరాల్లో సహజంగా పెరిగే కొబ్బరిచెట్ల కాయలు సముద్రాల్లో పడుతుంటాయి. కెరటాలు ఊరుకుంటాయా! వాటిని తమతోపాటు తీసుకెళ్తాయి. అలా సముద్రంలో అలలతో కలిసి ఐదు వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తాయి. ఆ తర్వాతే ఏ తీరానికో చేరి మొలకెత్తుతాయి. కొన్ని కొబ్బరికాయలు ఏడాది దాటేకే సముద్రంలోనే కుళ్లిపోతాయి. సముద్రంలో కొబ్బరికాయ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పీతలకు చిక్కితే అంతే సంగతులు. శుభ్రంగా కొబ్బరి పీచును తీసి లోపలి కొబ్బరిని ఆరగించేస్తాయి. ఇది కొంత వరకు నయం. ఒక్కోసారి సముద్రాల్లో తుపాన్లు వస్తాయి. అప్పుడు చూడాలి! అలలతోపాటు ఇవి రాళ్లను, కొండలను ఢీకొనాల్సి వస్తుంది. ఇన్ని కష్టాలనుంచి బయటపడి తీరం మీద పడిన వెంటనే కొబ్బరికాయ నుంచి ఆకు బయటికి వస్తుంది.

మిడత తెలివి

మనుషులే కాదు ప్రకృతిలో ప్రతి జీవికీ తనను తాను రక్షించుకొనే విధానాలు, ఉపాయాలు వున్నాయి. మిడత ఎంత చిన్న ప్రాణి? పైగా ఎవరికీ అపకారం కూడా చేయదు. ఆకులమీద పడి బతుకుతుంటుంది. ఏదైనా తొండగానీ తన మీదకి వస్తుంటే ఏం చేస్తుందో తెల్సా! నోటి నుంచి గాలి బుడగలను ఒదులుతుంది. వాటి వల్ల తొండకు వికారం, తలనొప్పి కలుగుతుంది. అలాంటి రసాయనాలు ఆ గాలి బుడగల్లో వుంటాయి. ఈ బుడగలు బద్దలయ్యాక విడుదలయ్యే రసాయనాలే మిడతలకు లక్ష్మణరేఖల్లా కాపలా కాస్తాయి. ఒకవేళ ఈ ప్రయత్నం విఫలమైందనుకోండి. ఒక చుక్క వాంతి చేసుకొంటుంది. ఇదే తన ఆఖరి అస్త్రం. ఈ వాంతి నుంచి భయంకరమైన దుర్గంధం వస్తుంది. దానివల్ల శత్రువు మిడత జోలికి వస్తే ఒట్టు.

తొలి పెంపుడు పిల్లి

పిల్లులను, కుక్కలను పెంచుకుంటుంటాం కదా. మరి తొలిసారిగా పిల్లులను పెంచుకోవాలన్న ఆలోచన ఎవరికి వచ్చింది.... అంటే ఈజిప్టువాసులకే అని తెలుస్తోంది. ఎలాగంటారా? సైప్రస్‌లోని నవీన శిలాయుగానికి చెందిన ఓ గ్రామంలో పురావస్తు పరిశోధకులు చేసిన తవ్వకాలు... చెప్తున్నాయి. ఓ మనిషి ప్రాచీన అవశేషాల పక్కనే చెక్కుచెదరని పిల్లి కంకాళం కూడా కనిపించింది. చనిపోయిన ఓ మనిషి మృత దేహం పక్కనే పిల్లి కళేబరాన్ని కూడా అప్పట్లో ఖననం చేసినట్టు ఆధారాలు చెబుతున్నాయి. ఈ అవశేషాలు తొమ్మిదివేల 500 సంవత్సరాల ప్రాచీనమైనవని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. అంటే ఈజిప్షియన్లు పిల్లిని విగ్రహంగా మలుచుకోవడానికి 5 వేల సంవత్సరాలకు ముందే సైప్రస్‌లో పిల్లిని పెంచుకొనేవారట.

◆ కథ

బోరు బండ

నులకమంచం మీద పడుకున్న రాజన్నకు బారెడు పొద్దెక్కినా లేవాలనిపించలేదు.

'ఇంత పొద్దున్నే లేచి ఏం చెయ్యాలా? లేచి యాడికి పోవాలా? పోయి ఎవుర్ని అప్పు అడగాలా? అడిగిన యెవుడు అప్పు ఇస్తాడు?' ఇలా ఆలోచిస్తూ నిదర రాదని తెలిసినా చేసేది లేక మళ్ళీ ముసుగుదన్ని పడుకున్నాడు రాజన్న. ఇటుక చూల కాలుస్తావుంటే బట్టీ పూర్తిగా పొగతో నల్లగా నిండిపోయి చుట్టుపక్కల జనాలకు ఊపిరి సలపనట్లుగా, కష్టాలన్నీ ఒకేసారి చుట్టుముట్టాక రాజన్న గుండెకూడా అలాగే మసిబారి దిక్కుతోచకుండా పోతావుంది. మూడు రోజులుగా రాజన్న భార్య వెంకటమ్మ మొగుడి వాలకం చూస్తానే వుంది. 'ఏం చెప్పాలో తెలవలా? తాగి తాగనకో, తిని తినకనో పిండిన ఆవుపాలు పొద్దున్న రెండు లీటర్లు, సాయంకాలం ఒక లీటరు పాలు పాలసంఘానికి పోస్తా వుంటూ ఆ వచ్చే పాతికో, పరకతో ఇల్లు ఈడ్చుకొస్తావుండాను. ఇన్నేళ్లు ఆయనేమో నలుగురికి అన్నం పెట్టేవాడు. ఇప్పుడు కూలిపనులకు పోతూ, నాలుగు రూకలతో ఇంటిని లాక్కొస్తున్నాడు. ఎట్లా వుండిన మనిషి ఇప్పుడు ఎట్లా అయిపోయాడు? తలచుకుంటుంటే' ఆమె కంట్లో నీళ్లు బొటబొట కారిపోతుండాయి. వెంకటమ్మ ఇంక ఉండబట్టలేక మొగుడ్ని కూతేసింది. "ఏమబ్బా! అట్లా పడుకుండిపోతే ఎట్లా? లేచి చంద్రగిరి పేటకన్నా పొయ్యొస్తే మేలు కదా! మనం గమ్మునున్నా అవసరాలు గమ్మునున్నిస్తాయా! ఈ రోజు ఎట్టాగో ఆదివారం, వారపు సంత జరగతాది. పేటలో చేగోళ్ల అంగట్లో ఇంటికి సరుకులు, సామాన్లు కాళ్లా, వేళ్లా పడి తెచ్చుకోవాల్సిందే. లేకుంటే రాత్రికి ఎసట్లోకి బియ్యం కూడా లేవు" అంటుంటే చెటుక్కున లేచాడు. ఏమైతేనేమి, జరిగేది జరుగుతుందని తలపోసుకుంటూ...

* * *

ఇన్నేళ్లుగా, రాజన్న ఉన్న రెండెకరాల మెట్టలో, వర్షాధారిత పంటలేసుకుంటూ, ఆ చేనుల్లో వున కీనీరు బావి నీళ్లు వాడుకుంటూ వచ్చే ఆదాయంతో సంసారాన్ని బాగానే నెట్టుకొచ్చాడు. గత మూడేళ్లుగా వర్షాలు లేక పోయేటప్పటికి బావి పూర్తిగా ఎండిపోయింది. కనీసం కూరగాయలు, పూలు పండించుకోవాలన్న నీటికి కటకట అయిపోయింది. పూటగడవడానికి అప్పులు చేయాల్సి వచ్చింది. వర్షాభావంతో రాజన్నలాంటి రైతుల బతుకు పల్లెల్లో దీనాతిదీనంగా మారిపోయింది. వారికి అప్పు పుట్టడం గగనమైపోయింది. కడుపులు మాడ్చుకుని బతకడం అలవాటైపోయింది. రాయలసీమలో రైతుల కడగండ్లు చెప్పనలవి కాకుండా పోయింది. రాజన్నకు నిద్ర రాకున్నా, అంతసేపు నులకమంచంపై పడి ఉండటానికి ముఖ్య కారణం ఇంకోటి వుంది. అది తెలవాలంటే మూడు రోజులు వెనక్కివెళ్ళాల్సిందే!

- డా.మౌని

సెల్: 9397048771.

* * *

రాజన్న ఆరోజు చేను కాడ దిగాలుగా కూర్చుని ఉన్నాడు. రాజన్నకు చేను అంటే ప్రాణం. దాన్ని వాళ్ల తాత, ముత్తాల కాలం నుంచి భద్రంగా భోషాణంలా కాపాడుకుంటూ వస్తావున్నాడు. చుట్టుపక్కల చాలా చేలు ఆర్థిక అవసరాలు బట్టి మారు బేరాలతో చేతులు మారిపోతున్నా.. రాజన్న వాళ్ళ నాయన, తాతలు చేను అమ్మడమంటే అమ్మను అమ్ముకున్నట్టే అనే పాపభీతితో బతికినారు. రాజన్నకు కూడా ఆ చేను, ఆ మట్టి అంటే అంత ప్రీతి. అన్నం లేకుండా బతికేస్తాడేమోగాని చేను లేకుండా బ్రతకలేడు. అందుకే ఇన్ని కష్టాలు పడుతున్నా 'ఆ నేల కొంటామని, ఎక్కువ రేటు తీసిస్తామని' ఎందరు పోరు పెడుతున్నా ససేమిరా అంటూ పట్టు వదలకుండా ఉండిపోయాడు. ఇలా పరిస్థితుల్ని తలపోసుకుంటూ వుంటే పక్క చేను ఐదెకరాల ఆసామి పాశం నారాయణస్వామి వచ్చి పలకరిస్తూ "ఏం రాజన్న! పైకి చూస్తూ దిగాలుబడి కూర్చుండిపోయావే.... ఏందబ్బా! కథ..." అంటుంటే రాజన్న "ఏముందన్న పైన మోడాలు బాగా తిరుగుతుంటేను వానేమన్న వస్తుందేమోనని ఆశగా చూస్తువుండానన్నా".

"ఒరే! నీ పాసుగాలా! ఇంకా వానని నమ్ముకుంటూ ఉండావా? ఈ మూడేళ్లు నమ్ముకునింది చాలుకాని, నే చెప్పినట్లు ఇంకన్న విని ఈ నేలను ఎవడికో ఒకడికి వచ్చినకాడికి దొంగలుతోలేసెయ్. నువ్వు నీ పెండ్లాం, బిడ్డలు సుఖపడిపోతారు" అని పాశం ఆయన అంటుంటే రాజన్నకు చురుక్కు మంది.

"ఏందప్పా! మాటొస్తే నీ నేల అమ్మెయ్.... అమ్మెయ్‌మంటావు. నాకేమన్నా మీ మాదిరి నాలుగు చోట్ల భూములున్నాయా... అమ్ముకునేందుకు? నీకుండే మాదిరి సంపాదించే చేతికొచ్చిన బిడ్డలున్నారా? ఆ నేల అమ్మకానికి పెట్టే మాట తప్పించి, ఇంకేదైన చెప్పన్న వింటాను" అని నిష్ఠూరమాడిపోయాడు రాజన్న.

పాశం నారాయణస్వామికి కోపం పొడుసుకొచ్చే. "ఏందిరా రాజన్న! ఏదో కష్టాల్లో ఉండావని కదా! నీతో ఈ మాట చెప్పితిని కాని, ఊర్లో నీలాంటి చిన్నపాటి రైతులు ఎంతమంది లేరు. అందరూ నీలాగే ఉన్నారా? వాళ్లు నేల అమ్ముకుని చేసిన అప్పులు తీర్చుకుని, మిగిలింది... సగిలింది పెట్టుకుని చేతనైన చిన్నా చితిక వ్యాపారాలు చేస్తూ పేటలో బతకతావుండారు కదా! అని చెప్తినబ్బా. అంతేగాని నీవల్ల నాకొచ్చే లాభం ఏంవుంది రాజన్న. కాలాన్ని బట్టి, గాలిని బట్టి తూర్పాన పట్టితేనే కదబ్బా పొట్టో గిట్టో తేలేది" అని నిట్టూర్చి కదిలిపోబోయినాడు పాశం నారాయణస్వామి.

అంతలో రాజన్న ఆలోచనలో పడి "ఉండన్న, ఏదో బాధలో వుండి నా మనసులో ఉండే మాట అట్లా అన్నాను. ఇది మా ముత్తాతల సొత్తు అన్న. దీన్ని ఇప్పుడు అమ్మేస్తే ఒక సెంటు నేలకూడ ఉత్తరోత్తర కొనుక్కోలేనన్నా. ఆ నేల మీద వుండే ప్రేమతో దాన్ని వదులుకోవాలంటే నా ప్రాణం పోతా

వుండాదన్న" అని సంజాయిషీ చెప్పాడు రాజన్న. "అయితే! నేనింక నీకు చెప్పేది ఏముంది రాజన్న. ఇక నీ ఇష్టం. ఆ నేలలో చిన్న చిన్న పైర్లు పెట్టుకోవాలన్న అంతంత మాత్రం నీటి సదుపాయం అయినా ఉండాలి కదా. నీ బావి ఎండిపోయి ఎన్నాళ్లో అయింది. 'బోరు' వేసుకునే పరిస్థితి వుంటే ప్రయత్నిస్తే పోతుంది కదా. ఇట్లా ఎన్నేళ్లని ఈ కరువులో బడి నకనకలాడుతావు" అంటుంటే రాజన్నకు మనసులో ఎక్కడో ఆశ మళ్ళీ మిణుక్కు మిణుక్కుమంటోంది.

'అవును గదా!' అని అనుకుంటూ ఉండగానే పాశం నారాయణస్వామి చెప్పకనే చెప్పే. "ఊరికి దిగువ కయ్యల్లో తూమాటి మునిరత్నంనాయుడు బావి ఎండిపోయి రెండేళ్ళయిపోయే. ఆ యబ్బ కూడా మొన్నా మొన్నటిదాకా నీలాగే బాధలు పడతా వుండే. పేటలో ఎవరో రెడ్డి నీళ్ల బడే శాస్త్రం చూసి పాయింట్ పెట్టించాడబ్బా. తూమాటాయన అప్పోసొప్పో చేసి ధైర్యంగా బోరు వేయించాడు. ఈ పొద్దు ఆ బోరులో రెండించుల నీళ్ల వస్తావుండాది. ఆయప్ప పైరుకు బొటాబొటాగా సరిపోతావుండాయంట. నీక్కూడా ఆ మాత్రం పడితే సరిపోతాయబ్బ" అంటుంటే రాజన్న అనుమానం లేవనెత్తే. "లేదన్న నువ్వుచెప్పేది నిజమే కాని, బోర్లు వేసినోళ్లందరి చేనల్లో నీళ్లు పడలేదుకదన్నా. వాళ్ళింకా అప్పుల్లో పడి కొన ఊపిరితో అప్పు తీర్చలేక చస్తావుండారు. పెద్దింటి పొండన్న 60 వేలు అప్పు చేసి బోరు వేస్తే ఏమైందన్న. మొరవపల్లి రఘుపతినాయుడు పొలంలో రెండు బోర్లు వేసి నీళ్ల పడకపోతే ఆ అప్పులు తీర్చేందుకు ఆ నేల అమ్ముకోవాల్సి వచ్చింది కదన్న. ఇప్పుడు కాసిపెంట్ల పాల ఫ్యాక్టరీలో నన్నూరు రూపాయల జీతానికి సెక్యూరిటి ఉద్యోగం చేయాల్సి వచ్చిందే. అంటుంటే పాశం నారాయణస్వామి "ఒరేయ్ రాజన్న ఎవరి అదృష్టం వాడిదిరా.... డబ్బులు కుదిరితే ఒకసారి ప్రయత్నిస్తే తప్పేముంది. ఇంక నీ ఇష్టంరా అబ్బా" అంటూ అక్కడ నుంచి ఆయన వెళ్లిపోయాడు.

* * *

ఆ రోజు నుంచి ఈ క్షణం వరకు రాజన్న అదే ఆలోచనలో ఉంటున్నాడు. 'నేలను అమ్మాలా? లేదా చేనులో బోరు వేయ్యాలా?' ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు. 'నేలను ఎట్టి పరిస్థితిల్లోనూ అమ్మే పనిలేదు. కాబట్టి ఏదో ధైర్యం చేసి బోరు వేయడానికి ఒక ప్రయత్నం చేద్దాం. నీళ్ల పడ్డాయో చిన్నా చితక పంటలు పండించి గట్టున పడిపోవచ్చు. మన ప్రయత్నం మనం చేద్దాం. ఆపై అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది' అని భార్యాభర్తలిద్దరు నేలను వ్యవసాయ బ్యాంకులో తనఖా కింద పెట్టి 60 వేలు అప్పు చేసి బోరు వేయించాలనే తీర్మానానికి వచ్చేశారు. ఊర్లో ఇంతకు ముందు బోరు వేయడానికి తనఖా బ్యాంకు నుంచి అప్పు తీసుకున్న వాళ్ల సాయం తీసుకుని, ఖర్చులు పెట్టి కాళ్లరిగేలా నెలరోజులు తిరిగి ఎలాగైతేనేం బ్యాంకు నుండి అప్పు సంపాదించుకున్నాడు. అందులో పదివేల రూపాయలు ఖర్చుల కింద పోగా, చేతిలో యాభైవేలు పెట్టుకుని చేనులో బోరు వేసే ప్రయత్నం మొదలుపెట్టాడు రాజన్న. నేలలో నీళ్ల పడేందుకు కొత్తపేట రెడ్డిని తీసుకొచ్చి పాయింట్ పెట్టించాడు. మురుగన్ బోరువెల్‌నాయుడు అడ్వాన్స్ కింద పదివేలు తీసుకుని చెప్పిన టైయానికి వచ్చి బోరు వేసే పని మొదలుపెట్టాడు. ఇది తెలిసిన పాశం నారాయణస్వామి ముసిముసిగా నవ్వుకున్నాడు. రాజన్న ఎదురింటి గురుసామప్ప మాత్రం తెగ బాధపడిపోయాడు. ఎక్కడ రాజన్న చేనులో బోరు నీళ్ల పడాతా యోమోనని, ఎక్కడ బాగుపడిపోతాడేమోనని. ఊర్లో చాలా మంది మాత్రం రాజన్న మంచితనానికి, మెతకతనానికి తప్పకుండా మంచి జరిగి బోరులో నీళ్లు పడతాయని ఆశతో ఉన్నారు.

* * *

వెంకటమ్మ టెంకాయ, కర్పూరం, ఆకూ వక్క, పూలుపండ్లు, దక్షణ తట్టలో పెట్టి తెచ్చి ఇచ్చింది. బోరువేసే పనివాళ్ల తరపున బోరింగ్ ఆపరేటర్ నీళ్ల పాయింట్ పెట్టిన చోట పూజ చేసి అందరికీ ప్రసాదం పంచి, బోరు డ్రిల్లింగ్ పని మొదలుపెట్టాడు. అందరూ ఎంతో ఆత్రంగా, ఆశగా, ఎదురుచూస్తూ ఉండారు. బోరింగ్ మిషన్ గుక్కపట్టి ఏడుస్తున్నట్లుగా బొరో మని శబ్దం చేస్తూ ఉంది. పైపులు రెండు నిలువులు నేలలో దించేశారు. పైకి దుమ్ము, ధూళి కలిసిన నున్నమట్టి ఎగజిమ్ముతోంది. ఆ ప్రాంతమంతా దుమ్మురేగిపోయింది. మళ్ళీ మూడు నిలువుల పైపుల దించేశారు. ఇప్పుడు కొంచెం కొంచెం రాతి పొడి బయటికి వెదజల్లుతుంది. ఇంతలో కాఫీలు, టిఫిన్‌లు తినేందుకు బోరింగ్ పనివాళ్లు పని నిలిపేశారు. వాళ్ళలో ఒకరంటున్నాడు 'తొలి రెండు నిలువల పైపులు బాగానే దిగినాయి. ఈ మూడు పైపులు నేలలో దిగేందుకు మాత్రం బాగా ఇబ్బంది అయ్యింది. బోరు డ్రిల్లింగ్‌కు రాతి బండ అడ్డంగా ఉండేటట్టు ఉందేమో! ఇట్లాగే ఉంటే ఇక రెండు మూడు నిలువలకంటే ఎక్కువ పైపులు దిగవేమో...' అని అనుకుంటుంటే రాజన్న ముఖం కళ తప్పిన చంద్రుడిలా మబ్బులు కమ్ముకుంటున్నట్లు ఉంది.

మళ్ళీ బోరింగు పని మొదలు పెట్టారు. ఒక నిలువు పైపు నేలలో దిగింది. పది నిమిషాల తర్వాత బోరింగ్ మిషన్ బాగా స్పీడెక్కించి తగ్గించినారు. ఆ దెబ్బతో అప్పుడు కొన్ని నీళ్లు పైకి ఎగజిమ్మినాయి. అందరూ ఆనందంతో ఒక అరుపు అరిచారు. అయితే అవి నీళ్ల పడిన దాఖలా గుర్తుకాదని, తాము డ్రిల్లింగ్ చేసేటప్పుడు లోపల నేల మెత్తగా ఉండేందుకు తాము బోరు పైపు ద్వారా పంపిస్తున్న నీళ్లని, అవి బోరింగ్ మిషన్ స్పీడు పెంచి నిలుపుచేస్తే, ఆ నీళ్లే తిరిగి ఎగజిమ్మినాయని బోరింగ్ మిషన్ ఆపరేటరు చెబుతుంటే అక్కడ వున్నవాళ్ల ఆశల ఆనందంపై ఒక్కసారి బిందెడు నీళ్ల కుమ్మరించినట్లయింది. ఇంకో నిలువు పైపు దించడం చేస్తున్నారు. డ్రిల్లింగ్ పని జరుగుతా ఉంది. బోరింగ్ మిషన్ శబ్దం చేస్తూ అదే పనిగా గుర్రుగుర్రు మంటు దెబ్బతిన్న పులిలా గాండ్రింపు చేస్తావుంది. అనుకోకుండా ఆకాశంలో మోడాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. నిజానికి వానపడితే ఇప్పుడో, ఈ క్షణమో పడాలి. వాతావరణం ఒక్కక్షణంలో మారిపోతావుంది. చల్లగాలులు వీచడం మొదలైంది. బోరింగ్ మిషన్ శబ్దం క్షణక్షణం పెరిగిపోతూ భయంకరంగా వినిపిస్తోంది. కొంతసేపటికి బోరింగ్ మిషన్ ఢర్‌ఢర్... డగ్‌డగ్‌మంటు ఒక అరుపు అరిచి సడన్‌గా ధనాధన్‌మంటూ ఆగిపోయింది. ఏం జరిగిందో ఏమో అని అందరిలో ఒక్కసారిగా నిశ్శబ్దం అవరించుకుంది. ఇప్పటికే సుమారు వందడుగుల లోతు బోరువేశారు. ఇంతలో, బోరింగ్ మిషన్ ఆపరేటర్ కెవ్వున అరిచాడు, 'లోపల డ్రిల్లింగ్‌రాడ్ బండరాయిని కొట్టుకుని విరిగిపోయింది. ఇక ఈ పాయింట్‌లో బోరు వేయడం కుదరదు. కొత్త డ్రిల్లింగ్ రాడ్ బిగించి మళ్ళీ కొత్తపాయింట్ పెడితే తప్ప బోర్ వేయలే'మని తేల్చి చెప్పాడు. ఈ మాటలు వింటున్న రాజన్న ముఖం పాలిపోయింది.రాజన్నపై బోరుబండ నిట్టనిలువున పడినట్లయ్యింది. ఒళ్లంతా చల్లబడిపోతూ ఉంది. కాళ్లు ఒక్కసారిగా గిలగిలకొట్టుకుంటూ ఉన్న చోటనే దబీలమని పడిపోయాడు, మొదలు నరికిన అరటిచెట్టులా.. నోట్లో బురుగొస్తోంది. ఏదైన ఇనుప వస్తువో, తాళం గుత్తో రాజన్న చేతిలో పెట్టండి అంటు పక్కనున్నోళ్లు అరుస్తున్నారు. భర్త పడిపోవడాన్ని చూస్తున్న వెంకటమ్మ పెట్టిన గావు కేక అక్కడున్నవారి గుండెలకు కత్తితో కోత పెట్టినట్లయ్యింది. అక్కడ ఏం జరుగుతోందో ఏమో? ఏం అర్థంకావడం లేదు. అప్పుడు ఆకాశంలో మెరుపులు మెరుస్తూ మేఘాలు భయంకర శబ్దం చేస్తు గర్జిస్తుంటే, ఒక్కసారిగా వర్షం కుండలతో కుమ్మరిస్తున్నట్లుగా పైనుంచి కిందకి దూకుతోంది....!

✦

నవ్వుల్ – పువ్వుల్

ఐరన్ టానిక్

సుబ్బారావు: ఇదిగో! బలానికి మంచి మందు ఇవ్వు.
మెడికల్ షాపువాడు : ఇది మంచి ఐరన్ టానిక్ . ఇది వాడావంటే...మాంచి దృఢంగా తయారవుతావు.
సుబ్బారావు: అదిసరే కానీ ఐరన్ టానిక్ అంటున్నావు...కడుపుతో పేగులు తుప్పు పట్టవు కదా!

ఏంత తగ్గిస్తారు?

"కిలో నూనె ఎంతండీ" షాపు యజమానికి అడిగింది సుభద్ర.
"నలభై రూపాయలమ్మా" చెప్పాడు యజమాని.
"ఒకేసారి పది కిలోలు తీసుకుంటే..ఏమైనా తగ్గుతుందా" బేరమాడింది సుభద్ర.
"ఒక అరకిలో తగ్గుతుందమ్మా" నవ్వుతూ అన్నాడు షాపు యజమాని.

ఆలస్యం ఏందుకు?

టీచర్ : కార్తీక్ ఎందుకు ఈ రోజు స్కూలుకు లేటుగా వచ్చావు.
కార్తీక్ : మీ వల్లే టీచర్.
టీచర్ : ఏం మాట్లాడుతున్నావు రా!
కార్తీక్ : మీరేగా టీచర్ ఇక నుండి స్కూలుకు లేటుగా రానని వెయ్యి సార్లు ఇంపోజిషన్ రాసుకురమ్మని నిన్న చెప్పారుగా. అది రాసేసరికి ఆలస్యమైంది.

ఠక్కున

"నీ పుట్టినరోజు ఎప్పుడు బుజ్జి?" అడిగింది టీచర్.
"జులై 19న టీచర్!" చెప్పాడు బుజ్జి.
"ఏ సంవత్సరం?" అడిగింది టీచర్
"ప్రతి సంవత్సరం టీచర్" ఠక్కున చెప్పాడు బుజ్జి.

పొదుపది భర్త

భార్య : చీర కొనుక్కుంటాను...వెయ్యి రూపాయలు ఇమ్మంటే నసుగుతారెందుకు! పెళ్లికి ముందు నేను డబ్బుని నీళ్లలా ఖర్చుపెడతానని తెగ కోతలు కోసారు కదండీ!
భర్త : పిచ్చిదానా! నేను నీళ్లను కూడా పొదుపుగానే వాడతా.

అభిమాన హీరో

వినయ్ : నా అభిమాన హీరో నటించిన సినిమాలన్నీ కనీసం నాలుగైదుసార్లైనా చూస్తాను.
విజయ్: ఏం పాపం ఒక్కసారి చూస్తే ...అర్థం కాదా ఏమిటి?

యాపిల్ పండు

రాజేష్: న్యూటన్ చెట్టు మీద నుండి యాపిల్ పండు పడగానే...కిందకెందుకు పడిందా అని ఆలోచించాడు. మరి నీవు ఏమని ఆలోచిస్తావు సురేష్.
సురేష్: మొదటిది తినేసి..రెండో యాపిల్ ఎప్పుడు పడుతుందా అని ఆలోచిస్తా అని టక్కున చెప్పాడు.

తెలివైన టైగర్

రమేష్ : మా టైగర్ చాలా తెలివైంది.
సురేష్ : ఏంటో దాని గొప్పతనం?
రమేష్ : పొద్దున్నే పేపర్ తెచ్చిస్తుంది.
సురేష్ : ఇదీ విశేషమేనా..అన్ని కుక్కలూ చేసేదేగా.
రమేష్ : కానీ మేం పేపరు వేయించుకోముగా...

అటెండరు



"పిల్లలూ! స్కూల్లో అందరికన్నా మీకు ఎవరంటే ఇష్టం" అని అడిగాడు జిల్లా విద్యాధికారి.
"మాకు అటెండర్ అంటే ఇష్టం" చెప్పారు పిల్లలందరూ ముక్త కంఠంతో.
"ఎందుకు" అడిగాడు ఆ అధికారి.
"ఆయన బెల్లు కొడితేనేగా మేము ఇంటికి వెళ్లేది..."అని తడుముకోకుండా చెప్పారు పిల్లలు.

దూరం



రాము : ఒరేయ్ రాజు! నేను నిన్ను ఒక ప్రశ్న అడుగుతా జవాబు చెప్పు.
రాజు : అడుగురా!
రాము: మనకు అమెరికా దూరమా? సూర్యుడు దూరమా?
రాజు : అమెరికానే దూరం...ఎందుకంటే రోజూ మనకు సూర్యుడు కనిపిస్తాడుగా.

ప్రజలను దోపిడీ పీడనుండి విముక్తి చేయాలి. స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం సిద్ధించాలి. ఇవే జీవిత లక్ష్యంగా పోరాడిన వ్యక్తి పాప ఉమానాథ్. తను సాధారణ మహిళే కావచ్చు కానీ, ఎంతో మంది మహిళలకు మార్గదర్శి ఆమె. పోరాటాలే ఊపిరిగా బతికిన పాప జీవితం.... పురుష ప్రపంచానికి సైతం స్ఫూర్తి పాఠం.

◆ యోధ

అమ్మని ఆఖరి చూపు చూడనివ్వలేదు

పాపా ఉమానాథ్ 1931న తమిళనాడులోని కోవిల్‌పట్టులో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు అలమేలు, పకీరస్వామి. చిన్న వయస్సులోనే తండ్రి చనిపోవడంతో పాప కుటుంబం రోడ్డున పడింది. తల్లి అలిమేలు రైల్వే కార్మికుల కోసం భోజన శాలను నడిపేది. అదే వారి కుటుంబానికి ఆధారం. అక్కడ తరచూ శ్రామికోద్యమాల గురించి, స్వాతంత్ర్య పోరాటం గురించి చర్చలు జరుగుతుండేవి. అవి పాపను ఆకర్షించాయి. రైల్వే యూనియన్ పత్రికలు, కరపత్రాలు చదివేవారు. అరకొర సంపాదన... కటుంబం గడవటానికే కష్టంగా మారడంతో ఏనిమిదో తరగతితోనే చదువుకు స్వస్తి పలకాల్సివచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం సమయంలో నాజీల దురాక్రమణలు, వాటిని సహసోపేతంగా సోవియట్ యూనియన్ ఎదుర్కున్న పరిణామాలు, రష్యన్ల ధీరోదాత్తత గురించిన సంఘటనలు ఆనాటి యువతను ఉత్తేజపరిచాయి. భారతదేశంలోనూ జాతీయోద్యమం ఊపందుకుంది. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలన్నింటినీ పాప నిశితంగా గమనించేవారు. బ్రిటీష్ వ్యతిరేక పోరాటాల్లో తనూ భాగస్వామి కావాలనే ఆకాంక్ష ఆమెలో బలంగా నాటుకుంది.

పొనమల్లై రైల్వే యూనియన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. కార్మికోద్యమాలను అణిచివేయడాన్ని వ్యతిరేకించేవారు. ఆ సమయంలోనే కొంత మంది కమ్యూనిస్టు నాయకుల పరిచయంతో శ్రామిక సిద్ధాంతం, వారి పోరాటాలు చూసి స్ఫూర్తిపొందిన పాప 1945లో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు నడుం బిగించారు. పాప రాజకీయ కార్యకలాపాలకు తల్లి అలిమేలు పూర్తి మద్దత్తు ఇచ్చేవారు.

పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమైన పాపకు, మద్రాస్ కేంద్రం కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న ఉమానాథ్‌తో వివాహం జరిగింది. స్వరాజ్యం సంపాదించన తర్వాత కూడా 1948న వామపక్ష కార్మికోద్యమాలను అణచివేసేందుకు సర్కారు పూనుకుంది. పార్టీని నిషేధించింది. కార్యకర్తలను అన్యాయంగా అరెస్టు చేసింది. 1950న సంవత్సరం పాప ఇంటిపై పోలీసులు దాడులు జరిపారు. పాప, తన తల్లి అలిమేలు, భర్త ఉమానాథ్‌లను అరెస్టు చేసారు. విచారణ నిమిత్తం పల్లవరం ఖారాగారానికి తరలించారు. పార్టీ సహచరుల సమాచారం తెలపమంటూ ఖాకీలు లాఠీలు ఝుళిపించాయి. వాటికి బెదరలేదు సరికదా, నోరు విప్పలేదు ఎవరూ. అక్కడ జైలు ఒక నరకకూపంలా ఉండేది. ఖైదీలు కుండల్లో మలమూత్రాలను పట్టి పారబోయాల్సి వచ్చే దుస్థితి. మరుగుదొడ్డికి వెళ్లినప్పుడు సైతం సంకెళ్ల తీసేవారు కాదు. వీటన్నింటినీ పాప వ్యతిరేకించింది. జైల్లోని పరిస్థితులను నిరశిస్తూ పాప, అలిమేలు, ఉమానాథ్ నిరాహార దీక్షకు పూనుకున్నారు. పోలీసులు పాప తలపై బలంగా కొట్టారు. ఆ దెబ్బలకు జడవలేదు ఆమె. జైలు అధికారులు ఖైదీల దీక్షను భగ్నం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృద్ధా అయ్యేవి. చివరికి వీరిని వేరు వేరు బారక్‌లలో బంధించారు. 21 రోజులు గడిచాయి. పాప నీరసంతో నేలపై పడి ఉన్నారు. అప్పుడే అక్కడికొచ్చిన ఒక జైలు వార్డెన్ పక్క సెల్‌లోనున్న మీ అమ్మ చనిపోయిందని చెప్పింది. తన తల్లిని కడసారి చూడనివ్వమని అధికారులను వేడుకుంది పాప. అయినా వారు కనికరించలేదు. "కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తే మీ అమ్మను చూడచ్చు" అన్నాడు పోలీసు ఆఫీసర్. అందుకు పాప తిరస్కరించింది. కన్నతల్లిని కడసారి చూపుకూ నోచుకోలేకపోయారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఇలాంటి కష్టాలను ఎన్నింటినో కడవరకూ ఓర్చారు పాప. ప్రజలను జాగురూకులను చేసేందుకు నిత్యం వారితోనే మమేకమయ్యారు. దోపిడీ విధానాన్ని వ్యతిరేకించారు. ఏంత తప్పుచేస్తే. ప్రముఖ వ్యక్తి అయినా నిరభ్యంతరంగా ప్రశ్నించేవారు. స్త్రీ సమానత్వం కోసం చివరి వరకూ పనిచేసారు. పరితపించారు. చట్ట సభల్లో సైతం జనం గళమై తన వాణిని వినిపించారు. మహిళ అబల కాదు...సబల అని నిరూపించారు. ✦

నిత్య సృజనశీలి అనూప్

"కొంత మంది యువకులు ముందు తరం దూతలు...' అన్నాడో కవి మహాశయుడు. అందుకు నిలువెత్తు నిదర్శనం కర్నాటకకు చెందిన అనూప్ విజాపూర్. సమాజం కోసం ఏదో ఒకటి చెయ్యాలని నిరంతరం తపన పడడమే కాదు. మరింత సులభంగా...పనులు చేసుకోవడానికి నూతన యంత్రాలను సృజించేందుకు నిత్యం ప్రయోగాల్లో మునిగి తేలుతుంటాడు. అతని మోముపై కదలాడే సన్నటి చిరునవ్వు వెనక ఎన్నెన్నో నూతన ఆలోచనలు దాగివున్నాయంటే నమ్మబుద్ధి కాదు.

అనూప్ విజాపూర్! చూడ్డానికి చదువుకునే కుర్రాడిలా కనిపిస్తాడు. కానీ ఇంజనీరింగ్ పూర్తయి... పలు యంత్రాలను తయారుచేసిన మేధావి అంటే నమ్మరెవరూ. జీడిపప్పును వేరు చేసే యంత్రాన్ని తయారుచేశాడు. పైగా కదిలే రైల్లోంచి వచ్చే పవనాల నుంచి విద్యుత్ తయారు చేయొచ్చని నిరూపించాడు. రాత్రిపూట భారీ వాహనాలను నడిపే డ్రైవర్లలో నిద్ర మోతాదు ఎప్పుడు ఎంత వుంటుందో కనిపెట్టి వారిని సమయం మించి పోక ముందే అలెర్ట్ చేసే యంత్రాన్ని కూడా రూపొందించాడు. అంతేకాదు! స్థానిక మున్సిపల్ అధికారులను నిద్ర నుంచి మేల్కొల్పి ఒక రోడ్డు వేయించడానికి కారకుడయ్యాడు.

అనూప్ ఇంజనీరింగ్ చదివే రోజుల్లో ...అతనిలో దాగివున్న సామాజిక స్పృహ గురించి పది మందికీ తెలిసే అవకాశం కలిగింది. 2009లో అనుకుంటా! హోస్పేట్ నుంచి హుబ్లి వెళ్లే దారిలో ఒక వీధి నరకానికి చిరునామాగా వుండడాన్ని గమనించాడతను. గుంతలు, మురికినీళ్లు, దోమలతో నడవడానికి కూడా అసౌకర్యంగా వుండేదా రోడ్డు. ఎవరినడిగినా ఒకటే సమాధానం. 'మున్సిపాలిటీ ఏమీ చేయడం లేదు. చాలా సార్లు ఫిర్యాదు కూడా చేశాం. కానీ ఎలాంటి కదలికా లేదు...'. దాంతో అతనే ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. కాలేజీలో 'దేశ్ పాండే ఫౌండేషన్' నుంచి వెయ్యి రూపాయల సాయం అందుకున్నారు. నేస్తాలంతా కలిసి మరో దాత ద్వారా వెయ్యి రూపాయలు సమీకరించారు. అలా వచ్చిన డబ్బుతో రెండు రోజుల పాటు రోడ్డు రాకపోకలు ఆపు చేసి మట్టి వేసి నడవడానికి వీలుగా తయారుచేశారు. రోడ్డు బాగు చేయడానికి ముందు , తర్వాత ఫొటోలు తీసి మున్సిపాలిటీ

వారికి చూపించాడు అనూప్. ఏమైందో తెలీదు కానీ వారం తర్వాత తారు రోడ్డు వేశారు అధికారులు. కాలేజీలో చేసిన ప్రాజెక్టుకు మంచి పేరు వచ్చింది. కదులుతున్న రైలు నుంచి వచ్చే గాలుల నుంచి విద్యుత్తును తయారు చేయవచ్చన్నది అతని థీరీ. చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ... రైళ్ల నుంచి వస్తున్న గాలితో ప్రయోగం చేయడానికి ...అతనికి అనుమతి లభించలేదు. అయితేనేం! ఒక మీటరు వెడల్పు, రెండు అడుగుల పొడవు గల విండ్ టర్బైన్లతో తను చెప్పినదాన్ని చేసి చూపించాడు విజయవంతంగా.

'హెపటైటిస్ ఎ' రావడం వల్ల ఆస్పత్రిపాలై చేతికి సెలైన్‌తో పరీక్షలు రాశాడు అనూప్. అంత కష్టపడ్డా ఒక్క సబ్జెక్టులో పాస్ కాలేకపోయాడు. దాంతో అతనికి రావాల్సిన అన్ని అవకాశాలపైనా ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. కానీ పట్టువదలకుండా...ఆ బ్యాక్‌లాగ్‌తోనే 'నానోపిక్స్' సంస్థలో దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే ఈలోగా రీవాల్యూయేషన్‌కు పెట్టుకోవడంతో పాసైనట్టు శుభవార్త అందింది. నానోపిక్స్‌లో అతనికి ఇచ్చిన తొలి ప్రాజెక్టు. జీడిపప్పును వేరు చేసే యంత్రాన్ని మరింత వినూత్నంగా...ప్రయోజనకరంగా రూపొందించడం. అతను ఎన్నో ప్రయోగాలు చేసి ఏడు రకాలుగా పప్పును వేరు చేసే యంత్రాన్ని రూపొందించాడు. మొదట్లో గంటకు 30 –35 కేజీల జీడిపప్పును వేరు చేసే యంత్రాన్ని 70–75 కేజీల పప్పును వేరుచేసేలా ఆధునీకరించాడు అనూప్. దాంతో అతనికి సంస్థలో మంచి గుర్తింపు లభించింది. 'నానో పిక్స్ ఇప్పటికి అరవై యంత్రాలను అమ్మింది. ఒక్కో మెషీన్ ధర 13.5 లక్షల రూపాయలు. వ్యక్తిగతంగా అంత ధర పెట్టి కొనుగోలు చేయలేకపోయినా...సంస్థలు,కంపెనీలకు మాత్రం చాలా ఉపయోగకరంగా వుంటుందా మిషన్' అన్న అనూప్ మాటల్లో.. కళ్లల్లో...ఇంకా సాధించగలనన్న విశ్వాసం నిండుగా కనిపిస్తుంది.

ప్రయాణం

క్యాన్సర్ అవగాహన కోసం

ఊహించనివి జరగడమే జీవితం. ఎవ్వరూ అందుకు అతీతులు కారు. రీతు బియాని కూడా అంతే. వృత్తి రీత్యా డెంటిస్ట్. ప్రయాణాలు చేయడమంటే ప్రాణం. సాహస క్రీడలంటే మరింత ఇష్టం. అలాంటి తనకు రొమ్ము క్యాన్సర్ అని తెలిసింది. ధైర్యంగా ఆ మహమ్మారితో పోరాడి విజయం సాధించింది. అయితే తనకు జబ్బు సోకిన విషయాన్ని రహస్యంగా వుంచాలనుకోలా. వర్కుషాపుల ద్వారా కాన్సర్‌పై అవగాహన కల్పించాలనుకుంది.
రీతు ప్రయాణం ఎలా మొదలైంది? వర్కుషాపుల్లో ప్రజల స్పందన ఎలా వుండేది. ప్రయాణంలో ఎదుర్కొన్న సమస్యలు. భవిష్యత్ ప్రణాళికలు... ఆమె మాటల్లోనే.

అది 2000 సంవత్సరం అనుకుంటా. కీమోథెరపీ వల్ల వెంట్రుకలన్నీ ఊడిపోయాయి. పంటి వైద్యం కోసం ఓ మహిళ క్లినిక్ లోపలికి వచ్చింది. తిరుపతి వెళ్లొచ్చారా అనడిగింది. నాకు జరిగిన రొమ్ము క్యాన్సర్ చికిత్స గురించి చెప్పాను. క్యాన్సర్ అంటువ్యాధి అనుకుని...ఆమె లేచి వెళ్లిపోయింది. చదువుకున్న వారిలో కూడా కొన్ని దురభిప్రాయాలు వుంటున్నాయి. కాన్సర్ పట్ల అవగాహన కల్పించడానికి నాకెంతో ఇష్టమైన పర్యాటకాన్ని ఎంచుకున్నాను.

రకరకాల స్పందనలు వచ్చేవి. మొదట్లో 'ఏంటీ మీకు రొమ్ము తీసేశారా?' అనడిగేవారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలన్న వ్యత్యాసం వుండేది కాదు. 90 శాతం మహిళలకు రొమ్ము క్యాన్సర్ గురించి, 70-80 శాతం మందికి సర్వైకల్ క్యాన్సర్ గురించి తెలియదు. గిరిజన ప్రాంత ప్రజల్లో ఈ సమస్య బాగా వుంది. 26 రాష్ట్రాల్లో 140 వర్కుషాపులు నడిపాను. 26000 మంది హాజరయ్యారు.

క్యాన్సర్‌కు వివక్ష లేదు. ఒకశాతం మగవాళ్లలో కూడా రొమ్ము క్యాన్సర్ వస్తుందన్నప్పుడు వారు మరింత ఆసక్తితో వినేవారు. జనాన్ని ఆకట్టుకోవడానికి గ్రాఫిక్స్, బొమ్మలు వాడేదాన్ని. నేను సైన్యంలో పనిచేసినప్పుడు గ్రామీణ, గిరిజన ప్రజల పరిస్థితులపై చక్కటి అవగాహన వుంది. మేం హోటళ్లలో బస చేయకుండా గిరిజన ప్రాంతాల్లో మంచాల్లేకుండా నేల మీదే పడుకునేవాళ్లం. మన ముందర వుంది సమస్యలు కాదు. సవాళ్లే.

ఇప్పుడు మేం కార్పొరేట్ స్కూళ్లు, ఎం.బి.ఎ కాలేజీలు, ఆసుపత్రులు, ఆర్మీ క్యాంపుల్లో వర్కుషాపులు నిర్వహించాలనుకుంటున్నాం. 2010లో అనుకుంటా ... మొదటి సారిగా అంతర్జాతీయ స్థాయి వర్కుషాపు పెట్టాం. జాతీయంగా, అంతర్జాతీయంగా క్యాన్సర్‌పై అవగాహన కలిగించే వార్కుషాపులు పెట్టేందుకు ఆలోచిస్తున్నాం. కంపెనీల నుంచి, వ్యక్తుల నుంచి ఆర్థిక సాయం తీసుకుంటున్నాం. ✦

బాల భీం

పాప ఎంత బొద్దుగా ముద్దుగా వుందో కదా! కానీ ఒక విషయం చెప్తే మటుకు ఆశ్చర్యపోవాల్సిందే. తను పది నెలల పాల. కానీ ఆరేళ్ల పాపలా వుంటుంది. బరువు కూడా అంతే. సుమారుగా పంతొమ్మిది కేజీలుంటుంది. సాధారణంగా ఆరేళ్ల పిల్లలు అంత బరువుంటారట. ఇంతకీ ఈ బాల భీమి పేరేంటనుకున్నారు! ఆలియ సలీమా. జార్ఖండ్ రాష్ట్రం. పాప విపరీతమైన బరువు వుండడంతో భయపడిపోతున్నారు తల్లిదండ్రులు. పేదరికం కారణంగా ఆమెను మంచి వైద్యులకు సైతం చూయించలేకపోతున్నారు. ఎట్టకేలకు ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చూపించగలిగారు. అక్కడ ఆలియాను పరీక్షించిన డాక్టర్ కిషన్ చుగ్‌కు మొదట నోటెంట మాటే రాలేదట. ఇంత బరువాటి పాపను ఆయన కెరీర్‌లో ఇదే మొదటిసారిగా చూశారట. పాపకు కొన్ని ఆరోగ్య సమస్యలున్నాయని... చికిత్స చేయాల్సి వుందని చెప్తున్నారాయన. ఆలియా ఆహారం కూడా కొంచెం ఎక్కువగానే తింటుంది. పగలంతా దాదాపుగా ఏడుస్తూనే వుంటుంది. పోనీ రాత్రుళ్లయినా ప్రశాంతంగా నిద్రపోతుందా అంటే అదీ లేదు. ఎప్పుడు పడితే అప్పుడు లేచి రాగం అందుకుంటుందట. బాగా బొద్దుగా వుండడం వల్ల ఆమెను చూడ్డానికి నిత్యం ఎవరో ఒకరు వచ్చిపోతుండడంతో ఇల్లొక తీర్థంలా వుంటుంది. ఆలియాకంటే ముందు పుట్టిన అబ్బాయి మాత్రం మామూలు బరువుతో ఆరోగ్యంగానే వున్నాడు. మరి తనకే ఎందుకిలా అనేదే అంతుబట్టడం లేదు. ✦

చదువుకున్నవారు...చదువుకోని వారు... అనే తేడా లేదు. అందరూ గాడ్జెట్లకు బానిసలే. మార్కెట్ లోకి కొత్త ఫోన్ వస్తే చాలు. నిన్న గాక మొన్న కొన్న ఫోన్‌ను కూడా పక్కన పడేసి ... న్యూ మోడల్ సొంతం చేసుకోవాలని చూస్తుంటారు. కానీ ముకుంద్ అలా కాదు. పాత వాటి నుంచి కొత్త వాటిని సృజించడానికి తపన పడతాడు. గత పదేళ్లలో చెత్త నుంచి పది వేల కంప్యూటర్లను తయారు చేసి అందించాడు. మరి ముకుంద్ ఎవరో! అతనికా ఆలోచన ఎలా వచ్చిందో చూద్దాం!

చెత్త నుంచి కంప్యూటర్లు

ముకుంద్ బి.ఎస్. ముప్పై మూడేళ్ల యువ పారిశ్రామికవేత్త. అంతకంటే ముందు ఎలక్ట్రానిక్ ఇంజనీర్. ఐఐఎం గ్రాడ్యుయేట్. పనికిరాని ఇ చెత్త నుంచి కంప్యూటర్లను తయారు చేయవచ్చన్న ఆలోచన అతనికి అనుకోకుండా వచ్చింది. అతని 'రి న్యూ' ఆలోచన కూడా అలా వచ్చిందే.
2009లో అనుకుంటా! 'రి న్యూ ఇట్'ని ప్రారంభించాడు. దానికి సంబంధించి చాలా కష్టపడ్డాడు. ఎలా చేస్తే తను అనుకున్నది సాధించగలడోనని అనేకానేక ప్రయోగాలు చేశాడు. మొదట్లో అతనొక్కడినే పనంతా చేసుకోవాల్సి వచ్చేది. మార్కెటింగ్, కొనుగోలు దార్లతో మాటా మంతీ, పెట్టుబడి సమకూర్చుకోవడం...వంటివన్నీ..!
ప్రస్తుతం ముకుంద్‌కు తోడుగా అతని సోదరుడు రాఘవ్ కూడా వున్నాడు. వీరు కాక ఏడుగురు టెక్నీషిన్లు, సేల్స్ పర్సన్లు సహాయకులుగా వున్నారు.
వీరి వ్యాపారం గురించి వినడానికి చెప్పుకోవడానికి సింపుల్‌గా వుంటుంది. అదీ కార్పొరేట్ ఆఫీసుల నుంచి పనికిరాని కంప్యూటర్లను సేకరించడం మొదటి పని. టెక్నీషియన్ల బృందం చెత్తను పరిశీలిస్తుంది. ఆనక దాన్ని విభజిస్తుంది. అంటే పనికి రాని వాటిని తీసేయడం. ఉపయోగపడేవాటిని ఒక పక్కన పెట్టుకోవడం. వాటి నుంచి పని చక్కగా చేసే కంప్యూటర్‌ను తయారు చేయడంతో పని ముగుస్తుంది. ఇందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది.
అయితే చెత్తను కొనుగోలు చేయడం అంత సులభమేం కాదు. కొందరైతే పనికి రాని కంప్యూటర్లను కిలోల లెక్కన అమ్మేస్తుంటారు. మరేదైనా వస్తువులైతే ఆ పద్ధతిలో అమ్మొచ్చు కానీ... కంప్యూటర్ల విషయంలో మాత్రం అలా చేయకూడదన్నది ముకుంద్ మాట.



గత ఐదేళ్లలో ముకుంద్ స్థాపించిన 'రి న్యూ ఇట్' కంపెనీ ఆ విధంగా రూపొందించిన 10,000 కంప్యూటర్లను అమ్మింది. అదీ చవక ధరలకు. 20 లక్షల రూపాయలతో ప్రారంభించిన కంపెనీ పెట్టుబడులు ఇప్పుడు 50-60 లక్షలకు చేరుకొంది. కుటుంబంవైపు నుంచి పూర్తి సహకారం వుండడం వల్ల కూడా అతను అనుకున్నది అనుకున్నట్టు చెయ్యగలుగుతున్నాడు. బెంగుళూరులో ప్రారంభించిన కంపెనీకి ప్రస్తుతం హైదరాబాద్, ముంబైల్లో కూడా బ్రాంచీలున్నాయి. ఇంతవరకు వినడానికి స్ఫూర్తిదాయకంగా వున్నా... కానీ భవిష్యత్ మీద అతనికి కొన్ని అనుమానాలున్నాయి.
"సాంకేతికంగా రోజు రోజుకూ ఎన్నో మార్పులు వస్తున్నాయి. పైగా ఆ కంపెనీ మొదలెట్టినప్పుడు స్మార్ట్‌ఫోన్లు లేవు. ఇప్పుడు చాలా మంది తమ స్మార్ట్ ఫోన్‌లోనే ఎక్కువ శాతం పనులు చేసేస్తున్నారు. కంప్యూటర్ల భవిష్యత్ ఎలా వుంటుందో చెప్పలేను..." అంటాడు ముకుంద్.
ముకుంద్ ఎదుర్కొనే మరో కీలకమైన సమస్య 'సరైన చెత్త'. అంటే అతను తయారుచేసే కంప్యూటర్లకు ఉపయోగపడే చెత్త దొరకడమనేది పెద్ద సమస్య. అంతేకాదు! కంప్యూటర్లను కొన్నవారు ... సరైన పద్ధతిలో ఎలా ఉపయోగించాలో తెలీకపోవడం వల్ల వాటి జీవితకాలం తగ్గిపోవడం ఇంకో సమస్య. ఏది ఏమైతేనేం తమ దగ్గర కంప్యూటర్ కొన్న వారికి ఏడాది పాటు ఉచిత సర్వీస్ చేస్తారు.
చిన్న వయసులోనే సొంత కాళ్ల మీద నిలబడి పది మందికి స్ఫూర్తినిస్తున్న ముకుంద్‌ను యువతకోసం రెండు మాటలు చెప్తున్నాడు.
"అనుకున్నది సాధించాలంటే...మన ప్రయాణం ఎప్పుడూ ఓపిగ్గా చేయాలి. ఒక్కోసారి చాలా సమయం ఎదురుచూడాల్సి వస్తుంది. ప్రతిదానికీ సమాధానం కూడా దొరకకపోవచ్చు ఒక్కోసారి. తప్పులు కూడా జరగొచ్చు. కానీ ... తృప్తి లభించే వరకు పని చేస్తూనే వుండాలి. అప్పుడు డబ్బు దానంతట అదే మనకు అందుతుంది....". ✦



అపురూప కళాఖండం బంగారు పాప

యాభయ్యవ దశకం తెలుగు సినిమా చరిత్రలో మహత్తర అధ్యాయం. ఆ దశాబ్దిలో అనేక సంచలన సామాజిక చిత్రాలు కనిపిస్తాయి. బిఎన్‌రెడ్డి తన వాహినీ పతాకంపై అందించిన సాటిలేని కళాఖండం 'బంగారు పాప' 1954 మార్చి 19న విడుదలైంది. మహానటుడు ఎస్వీ రంగారావు ఆ చిత్రంలో అద్భుతంగా నటించారు.

బి.నాగిరెడ్డి, బి.ఎన్.రెడ్డి అన్నదమ్ములైనప్పటికీ దారులు వేరు వేరు. ఒకరు విజయవంతమైన వాణిజ్యచిత్రాలు తీస్తే మరొకరు సందేశాత్మకమైన కళాత్మక చిత్రాలు తీసిన మేధావి. నాగిరెడ్డి కేవలం నిర్మాత మాత్రమే కాగా బిఎన్ భావుకుడైన దర్శకుడు. వారిద్దరికీ భాగస్వామ్యం వున్న వాహినీ స్టుడియోలో ఒక దశలో బిఎన్ హక్కులు కోల్పోయారు. ఆయన చిత్రాలు కూడా పెద్దగా విజయవంతం కాలేదు. అలాటి నిర్లిప్త దశలో ప్రత్యేకంగా తీసిన చిత్రం'బంగారు పాప' ఆయన 'మల్లీశ్వరి' అప్పటికే విడుదలై విజయదుందుభి మోగించడమే గాక బాగా పేరు తీసుకొచ్చింది. ఆ చిత్రాన్ని మించిన చిత్రంగా బిఎన్ 'బంగారు పాప'ను ఇష్టపడతారు.

బిఎన్ తీసిన చాలాచిత్రాలు అచ్చమైన తెలుగు చిత్రాల్లా వున్నా వాస్తవానికి వాటి మూలకథలు ఇంగ్లీషు నుంచి తీసుకుని మలచినవే. జార్జి ఇలియట్ రాసిన 'సైలాస్ మార్నర్' అనే నవలకు చిత్ర రూపం 'బంగారు పాప'. కరుడుగట్టిన రౌడీగా పేరు మోసిన వ్యక్తిని ఒక పసిపాప ప్రవేశం ఎలా మానవీయంగా మార్చేసిందన్నది ఈ చిత్ర కథ.

కమ్మరి కోటయ్య మంచివాడే గాక భక్తి ప్రపత్తులు మెండుగా వున్నవాడు. ఆ వూరికి వచ్చిన ఒక కపట స్వామి ఆమెను లొంగదీసుకుని తనతో తీసుకుపోవడమే గాక కుట్రపన్ని అతన్ని జైలుకు పంపిస్తాడు. తిరిగి వచ్చిన కోటయ్య రౌడీగా తాగుబోతుగా మారి ప్రతీకారంతో బుసలు కొడుతుంటాడు. ఆస్తులు అమ్ముకోవడానికి వూళ్లోకి రాబోతున్న స్వామిని ఎలాగైనా హత్యచేయాలని కత్తి నూరుకుని చూస్తుంటాడు. అలాటి సమయంలో అతనికి ఒక పసికందు ఆక్రందన వినిపిస్తుంది. చాలా ఘర్షణకు గురైన తర్వాత కత్తిని వదిలి పొత్తిళ్లలో పాపను తీసుకుంటాడు. ఆ పాప వూరి జమీందారు కొడుకు ప్రేమించిన శాంతకు పుట్టిన బిడ్డ. శాంత చనిపోగా మనోహర్ మరో పెళ్లి చేసుకున్నాడు. పాపను పెంచడం కోసం కోటయ్య పాత జీవితం వదిలేసి సాత్వికుడుగా మారిపోతాడు. తత్వాలు పాడుతూ గుడి దగ్గర గడుపుతుంటాడు. ఆమెను అందరూ పాప అనే పిలుస్తుంటారు. ఆమె తన బిడ్డేనని మనోహర్ కూడా తెలుసుకుంటాడు. జమీందారు మరో మనవడు అంటే మనోహర్ మేనల్లుడు శేఖర్ ఆమెను చూసి ఇష్టపడతాడు. దీనిపై మళ్లీ జమీందారు ఆగ్రహోదగ్రుడు కాగా మనోహర్ అప్పుడు బయిటపడి ఆమె తన కూతురేనని చెబుతాడు. వారి వివాహంతో కథ సుఖాంతం కావడమే గాక కోటయ్య అమితంగా ఆనందపడతాడు.

మొదట అమాయకుడైన భక్తుడుగా తర్వాత రౌడీగా ఆ పైన మానవతా మూర్తి కోటయ్యగా మూడు దశలనూ ఎస్వీఆర్ పండించిన తీరు అమోఘం. ఆయన నట జీవితానికి ఈ చిత్రం మకుటాయమానంగా పేరొందింది. లండన్‌లో ఈ చిత్రం చూసిన చార్లీ చాప్లిన్ రచయిత ఇలియట్ బతికుంటే ఈ నటనకు ఎంతో సంతోషి ంచి వుండేవాడని అన్నట్టు చెబుతారు. మరో ముఖ్యమైన పాత్రలో కృష్ణ కుమారి ముగ్ధమనోహరంగా నటించి తన భవిష్యత్తుకు పునాది వేసుకుంది. మనోహర్‌గా జగ్గయ్య సంఘర్షణను చక్కగా ప్రదర్శించాడు. అప్పుడే పుట్టిల్లులో నాయికగా నటించిన జమున శాంతగా తల్లి పాత్రలో కనిపిం చడం ఆమె తండ్రికి పెద్దగా ఇష్టంలేకున్నా బిఎన్ ఒప్పించారు. ఆమె మూడు సన్నివేశాల్లో మాత్రమే వుంటారు. ఇక శేఖర్‌గా రామశర్మ ఇతర పాత్రల్లో రామన్న పంతులు, వంగర, రమణారెడ్డి తదితరులు కనిపిస్తారు.

అప్పటికే అంతర్జాతీయ కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన పాలగుమ్మి పద్మరాజుతో తొలిసారి కథ, మాటలు రాయించారు బిఎన్. పాటలు కృష్ణశాస్త్రి, బాలాంత్రపు రజనీ కాంతారావు రాశారు. మాధవపెద్ది సత్యం పాడిన "తలాంగు తకధిమి తోల్‌బొమ్మ" పాట బాగా ప్రసిద్ధి కాగా "యవ్వన మధువనిలో" అనే పాట కూడా హాయిగా వుంటుంది. ఈ చిత్ర చాయాగ్రహణం నిర్వహించింది బిఎన్ సోదరుడు కొండారెడ్డి కాగా సంగీతం అద్దేపల్లి రామారావు. వీరెవరూ తర్వాత పెద్దగా రంగంలో లేరని చెప్పాలి.

బంగారు పాప రాష్ట్రపతి రజత పతకం పొందడం గొప్ప గుర్తింపుగా నిల్చిపోయింది. సత్యజిత్ రే పథేర్ పాంచాలికి స్వర్ణపతకం వచ్చిన ఏడే ఇది జరిగిందంటే బిఎన్ ప్రతిభ తెలుస్తుంది. ఆయన గురుతుల్యుడైన దేవకి బోస్ దీన్ని బెంగాలీలో సోనారే ఖతి పేరిట తీశారు. దేవదాసుతో మొదలుపెట్టి బెంగాలీ కథలే దిగుమతి అవుతున్న తరుణంలో ఇటు నుంచి అటు వెళ్లడం పెద్ద విశేషమే. అయితే తెలుగులోనూ బెంగాలీలోనూ కూడా మంచి పేరు తప్ప డబ్బులు తెచ్చిపెట్టలేకపోయింది. ✦

పీపీ

అతని ప్రపంచంలో ఆమె

నాన్న కుర్చీలో కూర్చొని దర్జాగా కాలుమీద కాలువేసుకొని దినపత్రిక చదువుతుంటాడు. అమ్మ కాఫీ అందిస్తుంటుంది. ఇది సహజంగా సినిమాల్లోనూ, కథల్లోనూ మనకు తారసపడే సన్నివేశం. కానీ ఇది ఒకప్పటి మాట. కాలం మారింది. ఇప్పుడు వంట గది అమ్మది మాత్రమే కాదు, నాన్నది కూడా. అలాగే కేవలం పురుష కేంద్రాలుగా ఉన్న కొన్ని రంగాల్లో సైతం మహిళలు ప్రవేశించి అద్భుతమైన ప్రతిభను చాటుతున్నారన్నది నేటి మాట. తరతరాల పురుషాధిఖ్య సమాజం పోకడలను పెకిళించి వేసి అన్నింటా తానవుతున్న అతివలు నేడు మన కళ్లముందు చాలా మందే కనిపిస్తుంటారు. వారిలో ముఖ్యంగా లారీలు, బస్సులు నడపడం, డోలు వాయించడం... సన్నాయి ఊదడం. ..పౌరోహిత్యం వహించడం ...వంటి విభిన్నమైన వృత్తుల్లో జీవనం గడుపుతున్న కొద్ది మంది మహిళల జీవితాల గురించి ఈ రోజు అట్టమీది కథలో తెలుసుకుందాం!

ఆడవాళ్లు అంటే వంట వండటం...ఇంటి పనులు...వంటి కొన్ని సున్నితమైన పనులు మాత్రమే చేయాలి. మగవారు అంటే మగమహారాజులు...వారు హుందాగా...దర్జాగా ఉండే పనులు చేస్తారు. మహిళలు బరువులు మోయలేరు. కావున వారు అల్లికలు...కుట్లు...లాంటి చిన్న చిన్న పనులకే అంకితం. పురుషులు బలవంతులు బరువులు మోయడం...భారీ పనులన్నీ వారివే. ఇవి తరతరాల నుండీ మన సమాజం నేర్పిన కట్టుబాట్లు. అయితే వాటన్నింటికీ కాలం చెల్లింది. అవసరమో..ఆసక్తి వలనో మహిళలు సైతం పురుషులు మాత్రమే చేయగలరు అనుకునే పనులను, వృత్తులను ఎంచుకొని వాటిపైనే జీవనాధారం గడుపుతున్నారు. వంటింటి నుండి ఉత్పత్తి రంగంలోకి స్త్రీలు అడుగిడినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో నడుస్తుంది అంటారు ప్రముఖ తత్వవేత్త కార్ల్ మార్క్స్. జనభాలో సగభాగమైన మహిళలు ఉత్పత్తిలో భాగస్వామ్యం వహించడం వల్ల ఆ సమాజం త్వరితగతిన ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందంజలో ఉంటుంది అనేది ఏవరూ కాదనలేని సత్యం. కానీ సనాతన ధర్మాలకు ఎక్కువగా ప్రాముఖ్యతనిచ్చే మన భారత్ లాంటి దేశాల్లో మహిళలపై అడుగడుగునా ఆంక్షలు...సంప్రదాయం సంస్కృతి పేరిట అణిచివేయడం తరతరాల నుండి కొనసాగుతున్న వారసత్వం. అయితే కొంత మంది మహానుభావుల సంస్కరణోద్యమాల ఫలం, స్త్రీల ఉద్యమ ఫలితం... కొంత మార్పు తెచ్చింది. అందులో భాగంగానే నేడు మనకు కొన్ని రంగాల్లో మహిళల ప్రవేశించడం కనిపిస్తుంది. ప్రకృతి పరంగా, శారీరక ధర్మాల పరంగా...స్త్రీ, పురుషులు వేరు వేరు. కానీ పనిలో..తెలివిలో..నిబద్ధతలో...క్రమశిక్షణలో... నైపుణ్యంలో...నాయకత్వంలో పురుషుడి కంటే స్త్రీ ఏ మాత్రం తక్కువ కాదు...ఇంకా ఓ ఆకు ఎక్కువే అనడానికి మన కళ్ల ముందు కనిపించే ఉదాహరణలు కోకొల్లలు.



రైట్....రైట్

కార్లు...స్కూటర్లు మహిళలు నడపటం సహజం. కానీ లారీలు, బస్సులు, రైలు ఇలాంటి పెద్ద పెద్ద వాహనాలు ఆడవాళ్ల తోలడం అన్నది వినడానికి కాస్త ఆశ్చర్యం అనిపించినా వాస్తవం. బతుకుదెరువు కోసం డ్రైవర్ వృత్తిని ఎంచుకొని జీవితం బడిని నడుపుతున్న వారు మన మధ్య చాలా మందే ఉన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన యోగిత భర్త లారీ డ్రైవర్. ఆయనకు సొంత లారీ కూడా ఉంది. విధి మోసం చేసింది. ప్రమాదంలో అతను మరణించాడు. కుటుంబభారం యోగిత మీద పడింది. ఆమె తన భర్త మార్గంలోనే నడవాలనుకుంది. లారీడ్రైవర్ వృత్తిని ఎంచుకుంది. వృత్తిలో భాగంగా ఇతర రాష్ట్రాలకు సైతం సరకు రవాణా చేయాల్సి ఉంటుంది. అంటే ఇంటికి మూడు రోజులకొకసారి, కొన్ని సార్లు వారానికొకసారి కూడా వస్తుంటుంది. మొదట్లో ఈమె ఈ పని చేయడమేంటని లోకం చెవులు కొరుక్కుంది. తర్వాత ఈమె కూడా చేస్తుంది అని ముక్కున వేలేసుకుంది. ఆటోలు నడుపుతున్న వారు, బస్సు నడుపుతున్న వారు, ట్రక్కు నడుపుతున్న మహిళలు యోగితలాంటి వారు నిత్య జీవితంలో కొద్ది మంది కనిపిస్తుంటారు. మన రాష్ట్రంలోకూడా వైజాగ్‌లో ఉష అనే మహిళ బస్సు నడుపుతారు. ఆమె పనితనం చూసి అచ్చెరు వొందిన ప్రభుత్వం రవాణా శాఖలో ఉద్యోగం కూడా కల్పించింది. ఇక ఆటో నడుపుతూ పొట్టపో సుకుంటున్న అక్కలు చాలా మందే కనిపిస్తారు. అయితే విధి వైపరీత్యం వల్లనో కుటుంబ అవసరాల కోసమో ఈ వృత్తిని ఎంచుకుంటున్నారే తప్ప, స్వతహాగా ఈ రంగంలోకి వచ్చే వారి సంఖ్య తక్కువే. ఈ మధ్య ప్రభుత్వం షీ క్యాబ్స్ పేరుతో కొంత మంది మహిళల్ని ప్రోత్సహించడం వింటున్నాం. ఆర్టీసీలో సైతం మహిళా డ్రైవర్ల పోస్టులు ఖాళీలు చాలానే ఉన్నాయి. కానీ ముందుకెవరూ రావడం లేదు. **యోగిత,**

లారీ డ్రైవర్

మేస్త్రీ నాగమ్మ

నిర్మాణ రంగంలో ఆడవాళ్ల పని అంటే సిమెంట్, ఇసుక, ఇటుక మోయడం....మాల్ అందించడం వంటి పనలు మాత్రమే చేస్తారు అని అనుకుంటాం. తాపీ పని ఆడవాళ్ల పని కాదు... అయినా వారి వల్ల ఏమవుతుందని పెదవి విరుస్తుంటారు చాలామంది. అలాంటి వారందరికీ సమాధానం నాగమల్లేశ్వరమ్మ. ఈమె స్వస్థలం కృష్ణాజిల్లాలోని కంకిపాడు మండలం, ఉప్పుటూరు గ్రామం. గత ముప్పై ఏళ్ల నుండి నిర్మాణ రంగంలో పనిచేస్తుంది నాగమ్మ. అయితే కేవలం మాల్ అందించడం మాత్రమే కాదు...ఒక భవన నిర్మాణానికి కావాల్సిన ఇసుక, సిమెంట్, కంకర వంటి లెక్కలన్నీ ఈమెకు తెలుసు. తాపీ పనిలోనూ చెయ్యి తిరిగిన మనిషి. ఈమె ఎన్నో భవనాలు కట్టింది. అంతేకాదు సొంతంగా భవనం కట్టడానికి కావాల్సిన వస్తువులను తేవడంలో కూడా ఈమెకు అవగాహన ఉంది. చాలా మటుకు తాపీ పని అంటే మగవాళ్ల పని అని అంటారు చాలా మంది. కానీ అది నిజం కాదు అని నిరూపించిందిఈ నాగమ్మ. ఈమె వయస్సు ఇప్పుడు 60 ఏళ్లు. అయితేనేం ఇప్పటికీ అదే హుషారు. భర్త జబ్బున పడి పనిచేయలేకపోవడంతో...తాపీ వృత్తినే ఎంచుకొని జీవనం గడుపుతూ పిల్లల్ని పెద్దవాళ్లని చేసి వారికీ అదే వృత్తి నేర్పింది ఈమె. అంతేకాదు నాగమ్మను తాపీ పనిలో సలహాలు, సూచనలు అడగడానికి వచ్చేవారూ అధికమే. మగవాళ్లే కాదు ఆడవాళ్లు భవనాలు కట్టగలరు అని నిరూపించిన నాగమ్మకు ఆ పనిలో మంచి పేరుకూడా ఉంది.

నాగమల్లేశ్వరమ్మ, తాపీ మేస్త్రీ

ఎన్నో సినిమాలకు పనిచేసా

సినిమా రంగంలో ఆడవాళ్ల చేసే పని అంటే తెర మీద నటించడం. తెరవెనుక విభాగాలు చూసుకుంటే దర్శకత్వ శాఖ, నిర్మాణం, ఆర్ట్, వంటి కొన్ని విభాగాల్లో మహిళలు పనిచేయడం సహజం. కానీ సౌండ్ అండ్ ఇంజనీరింగ్, ఛాయాగ్రహణం వంటి రంగాల్లో మహిళలు చాలా తక్కువ. మన తెలుగు చిత్ర సీమలో మరీ తక్కువ. విజయశ్రీ మాత్రమే తెలుగు చిత్ర సీమలో కెమెరా ఉమెన్. ఈమె కొన్ని సినిమాలకూ పనిచేసింది. కాకపోతే అవకాశాలు అంతగా రాలేదు. కారణం పురుషులతో పోటీ పడలేక కాదు. ఆమె ప్రతిభకు గుర్తింపులేక. అసలే ఆ రంగంలో ఆటుపోటులేకాదు...అవకతవకలూ ఎక్కువే కదా. కానీ వాటన్నింటినీ తట్టుకుని నిలబడగలిగారు పద్మశ్రీ. అలాగే సౌండ్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలోచూస్తే మన తెలుగునాట ఉన్న అన్నీ సినిమా ల్యాబ్స్‌లలో ఎంత వెతికినా ఒకే ఒక్క మహిళ కనబడతారు ఆమె వంశీ ప్రియ. ఈమె టీ.వీ అండ్ సౌండ్ ఇంజనీరింగ్ చదివి, గత పదేళ్ల నుండి ప్రసాద్ ల్యాబ్‌లో రికార్డిస్ట్‌గా (ఆడియో అండ్ సౌండ్, డబ్బింగ్)పనిచేస్తున్నారు. ఈ పదేళ్లలో ఇద్దరు మాత్రమే మహిళలు ఈ రంగంలోకి వచ్చి పట్టుమని పది నెలలు కూడా చేయకుండా వెళ్లిపోయారు అంటారు వంశీ ప్రియ. అయితే ఈమె ఎన్నో తెలుగు సినిమాలకు రికార్డిస్ట్‌గా పనిచేసారు. వంశీప్రియ పని తనం చూసి గుణశేఖర్, రాజమౌళి వంటి వారూ మెచ్చుకున్నారు కూడా. అయితే ఇప్పుడు ఈమె ఇద్దరు పిల్లలకు తల్లి. “వారికి సమయం కేటాయించలేకపోతున్నాను. సినిమా రిలీజ్ టైం దగ్గరపడిందంటే ఒక్కోసారి ఉదయం ఆఫీసుకెళ్లి మరనాడు మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చే పరిస్థితి కూడా ఉంటుంది. అయితే నా భర్త, అత్త ప్రోత్సాహం మర్చిపోలేను. ఈ రంగంలోకి మరింత మంది మహిళలు రావాలని కోరుకుంటున్నాను. ఇక్కడ అందరూ అనుకున్నట్టు ఇబ్బందులేమీ ఉండవు” అంటున్నారు వంశీప్రియ.

- వంశీ ప్రియ, సౌండ్ ఇంజనీర్,

డబ్బింగ్ రికార్డిస్ట్

డోలు వాయిద్యంలో ఘనాపాటి

మహిళలు అంటే కేవలం పాటలు పాడటమే కాదు...వాయిద్యాలు సైతం వాయిస్తారడానికి శ్రీదేవి ఉదాహరణ. ఈమె వయస్సు 37 సంవత్సరాలు. సొంతూరు విజయవాడ ఈమె తండ్రి డోలు వాయిద్యకారుడు. మధ్య తరగతి కుటుంబం కావడంతో ఆర్థిక తోడ్పాటుకోసం తండ్రి వద్దే డోలు వాయించడం నేర్చుకుంది. వివాహమైనా కూడా ఆ వృత్తిని ఆపలేదు. భర్త ఏడుకొండలు కూడా కాదనలేదు. అనేక పెళ్ళిళ్ళ, శుభకార్యాలు, వేడుకలకు డోలు వాయించేందుకు భర్తతో పాటే ఈమె వెళ్లేది. తర్వాత విజయవాడ అమ్మవారి గుడిలో ఉద్యోగ అవకాశం వచ్చింది. గత ఏడేళ్ల నుండి దుర్గ గుడిలో డోలు వాయిస్తున్నారు. "అయితే ఈ రంగంలో వివక్ష ఉంటుంది. మాతో పాటు సమానంతో వేతనం తీసుకుంటుంది అని చాలా మంది మగవారు సూటిపోటీ మాటలుకూడా అనేవారు" అంటారు శ్రీదేవి. కృష్ణ ఉత్సవాలకు సైతం శ్రీదేవి డోలు వాయిస్తే కృష్ణమ్మ మురిసిపోయేదని కొంత మంది సందర్శకులు సైతం మెచ్చుకునేవారట. డోలు నేర్చుకున్న తొలినాళ్లలో చాలా ఇబ్బందులు ఎదుర్కున్నాను. డోలు బరువు సుమారు 30 కేజీలుంటుంది. అది మోయడం కష్టం. ఒక్కోసారి వేళ్ల పగిలి రక్తం కూడా వస్తుంటుంది. కానీ అవేవీ పట్టించుకోకుండా ముందుకు వెళుతుంటాను. నా భర్త ప్రోత్సాహం నాకు ఉంది కావున నా వృత్తిలో నేను మరెన్నో మంచి కార్యక్రమాలు చేయగలుగుతున్నాను అంటున్నారు ఈమె. గతంలో రవీంద్రభారతిలో ఎన్నో కచేరీలు కూడా చేసారట.

శ్రీదేవి, డోలు వాయిద్యకారిణి

సన్నాయి కృష్ణకుమారి

మాచవరపు కృష్ణకుమారి, వయస్సు 40 ఏళ్లు. గుంటూరు పట్టణంలోని సీతానగంలో నివాసం. భర్త పేరు సుధాకర్. తండ్రి, భర్త ఇద్దరూ నాదస్వరమే ప్రధాన వృత్తి. దాంతో ఈమెకూ సన్నాయి నేర్చుకోవాలనే ఆసక్తి కలిగింది. వారి వద్దే నాదస్వరంలోశిక్షణ పొందింది. ఇప్పటికి ఎన్నో శుభకార్యాలకు నాదస్వరం ఊదింది కృష్ణ కుమారి. అయితే నాదస్వరం ఊదడం అన్నది అంత శులువేం కాదు. ఊదేప్పుడు ఊపిరి బిగపట్టాలి. అది చాలా ప్రయాశతో కూడుకున్న పనే. కానీ ఆ వృత్తి పట్ల ఆసక్తి, కుటుంబ పోషణ కోసం అవసరం రెండూ ఆమెను సన్నాయికి దగ్గరచేసాయి. "గర్భవతిగా ఉన్నప్పుడు చాలా ఇబ్బందులు ఏదుర్కున్నాను. డాక్టర్‌గారు ఆ వృత్తి మానేయమన్నారు. బిడ్డ పుట్టిన ఏడాది తర్వాత మళ్లీ వృత్తిలో కొనసాగాను. ఇప్పుడు పురుషులతో సమానంగా నాదస్వరం ఊదుతాను. చాలా మంది నన్ను ప్రత్యేకంగా పెళ్లిళ్లకు పిలుస్తారు. పనికి ఆడ, మగ తేడా లేదు."

మాచవరపు కృష్ణకుమారి, నాదస్వర కళాకారిణి

ఆటో కా రాణీ

హైదరాబాద్‌లోని నిజాంపేటరోడ్‌లో తిరిగే వారికి ఆటో ఝాన్సీ అక్క సుపరిచితురాలే. ఈమె అసలు పేరు వెన్నపూస నారాయణమ్మ. కుటుంబ పోషణకోసం గత ఆరేళ్ల నుండి ఆటో నడుపుతోంది. ఇప్పుడు ఈమెకు పెళ్లైంది. ఇద్దరు పిల్లలు కూడా. అయినా ఆ వృత్తిని మానలేదు. ఈమె భర్త కూడా ఆటో డ్రైవరే. ఆర్థికంగా అత్యంత పేద కుటుంబం కావడంతో ఈమెను చదివించలేదు తల్లిదండ్రులు. ఇక ఏం పనిచేసుకొని బతకాలా అని ఆలోచనలో ఉన్నప్పుడు ..తండ్రి ఆటోనే నేర్చుకుని ఆ వృత్తినే ఎంచుకోవడం మొదలుపెట్టింది. "మొదట్లో చాలా మంది విచిత్రంగా చూసేవారు. ఇప్పుడు నా ఆటో ఎక్కడానికే ఇష్టపడతారు. కారణం నేను అతి వేగంతో నడపను. గుట్కాలు, మద్యం వంటి వాసనలు నా ఆటోలో ఉండవని" అంటుంది రాములమ్మ. అయితే ట్రాఫిక్ రూల్స్ పాటించడంలో కూడా ఈమెకు మంచి పేరుంది. అందుకే ఈమెకు ఇంత వరకూ ఒక్కసారి కూడా చలానా విధించలేదు మన ట్రాఫిక్ పోలీసులు. ఇంకా ఆమెను చూసి నేర్చుకోండి అని ఇతరులకు చెబుతుంటారట వారు. తోటి ఆటో డ్రైవర్లు మాత్రం ఈమెను ఝాన్సీ అక్క అనిపిలుస్తుంటారు.

రాములమ్మ, ఆటో డైవర్

పెళ్లిచేసేందుకు ప్రత్యేకంగా పిలుస్తారు

ఆడవాళ్లు వేదం చదవకూడదు. ఇది వేదాల్లోనే రాసుంది. ఇవన్నీ గతం నుండీ పురుష ప్రపంచం పెట్టిన ఆంక్షలు. అవన్నీ శుద్ధ తప్పులు. అసలు ఎక్కడా ఆడవాళ్లు వేదాలు చదవకూడదనికానీ, వారు ఈ పనులకు మాత్రమే పరిమితం అని కానీ లేదు. ఈ విషయాల్ని నమ్మిన నా తండ్రి నన్ను పౌరోహిత్యం తీసుకునే విధంగా ప్రోత్సహించారు. నేను గత పదిహేను ఏళ్ల నుండి ఎన్నో వేల పెళ్లిళ్లు జరిపించాను. ఎన్నో యజ్ఞాలకు మంత్రోచ్చారణ చేసాను. చాలా మంది ప్రత్యేకంగా జ్యోతిశ్రీ గారు కావాలి అని పిలిపించుకుంటారు కూడా. నేను పుట్టి,పెరిగింది సికింద్రాబాద్‌లో. కానీ దేశవ్యాపితంగా తిరుగుతుంటాను పెళ్లిళ్ల జరపటానికి. మన తెలుగు నాట సుమారు 30 మంది వరకు మహిళా పౌరోహితులు ఉన్నారు. నేను ఈ వృత్తిలో ఎదుర్కున్న సవాళ్ల అంటే తొలినాళ్లలో ఆడవాళ్లు ఈ వృత్తి చేయకూడదు. అని వాదులాడేవారు. వారికి నేను సమాధానం చెప్పేదాన్ని . ఒక వేదుకలో నా మంత్రోచ్చారణ చూసి చుక్కారామయ్యగారు మెచ్చుకున్నారు. నా వృత్తి జీవితంలో గొప్పగా భావించే సంఘటన అది. నేను ఎక్కువగా కులాంతర వివాహాలు జరపడానికి ఇష్టపడతాను. ఆర్యసమాజంలో ఎన్నో కులాంతర వివాహాలకు మంత్రాలు చదివాను కూడా. వేదాలు పేరు మీద శాస్త్రాల పేరు మీద మహిళలపై కట్టుబాట్లు విధించి వారిని అణచివేయాలనుకునేవారికి నేను వ్యతిరేకిని. ఆడ, మగ ఇద్దరూ సమానమే. స్త్రీలకు ఏరంగంలోనైనా రాణించే సామర్థ్యం ఉంటుంది. వారికి కావాల్సింది ప్రోత్సాహం మాత్రమే.

జ్యోతిశ్రీ, పౌరోహితురాలు

సెలూన్ ఓనర్ మేరి

క్షౌర వృత్తిని చూస్తే ఈ వృత్తిలో కేవలం మగవాళ్లు మాత్రమే మంగలి పని చేయడం మనం చూస్తుంటాం. అయితే నేడు చాలా మంది ఆడవాళ్లు కూడా బ్యూటీ పార్లర్లు నిర్వహిస్తూ అందులో మహిళల అందానికి మెరుగులు దిద్దడం, కేశాలంకరణ వంటివి చేస్తుంటారు. కానీ అలా కాకుండా సాధారణంగా సెలూన్, హెయిర్ కట్టింగ్ షాపులు నడుపుతున్న మహిళలు మన రాష్ట్రంలో లేరు. కానీ తిరుమల, యాదగిరి గుట్ట వంటి దేవాలయాల్లో కళ్యాణ కట్టలో గుండు గీసేందుకు దేవాదాయ శాఖ వారు కొంత మంది స్త్రీలను నియమించారు. అయితే గతంలో చాలా మంది పురుష స్వాములోరు ఆగమ శాస్త్రం ప్రకారం స్త్రీలు ఆలయంలోని పనులు చేయరాదని గగ్గోలు పెట్టారు. విషయం కోర్టుకెక్కింది. శాస్త్రాల్లో ఎక్కడా మహిళలు ఈ పని చేయకూడదు అని లేదని కొంత మంది సామాజిక కార్యకర్తలు నిరూపించడంతో మహిళలకూ అక్కడ మంగలి కొలువులు దక్కాయి. మన పొరుగు రాష్ట్రం తమిళనాడులోని తిరుచ్చి చింతమని బజార్ దగ్గర ఒక హెయిర్ సెలూన్ షాప్ కనిపిస్తుంది. పక్కనే ఓ మూల బట్టల కుట్టు మిషన్ కూడా ఉంటుంది. అయితే అక్కడ మగ పిల్లల బట్టలు కుడతారు. ఈ రెండు పనులు చేసేది మాత్రం సాధారణ మహిళైన మేరి. ఈమె భర్త షణ్ముగన్ బట్టలు కుడుతూ, సెలూన్ షాప్ నడుపుతుంటారు. అయితే ఆయన ఈ రెండూ పనులూ ఒకేసారి చూసుకోలేకపోతున్నారని ...ఆయన కష్టం చూడలేని మేరి తనూ ఆ పనులు నేర్చుకుని అతనికి సహాయకారిగా ఉందామనుకుంది. అంతే భర్తే గురువు. ఇప్పుడు ఈ రెండూ పనులూ మేరినే చూసుకుంటుంది. ఈమె భర్త వేరే పనులకు వెళుతున్నాడు ఇప్పుడు. ఆ ప్రాంతం వెళ్లి ఇక్కడ మగపిల్లల బట్టలు ఎక్కడ బాగా కుడతారు అంటే చాలామంది మేరి షాపునే చెబుతారంట.

మేరి, సెలూన్, జెంట్స్ టైలరింగ్ షాపు

ఇందులేదు...అందులేదనడానికి లేకుండా నేడు ఆధునిక మహిళ అన్నీ రంగాల్లో తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటుంది. అయితే ఇది మాత్రం సరిపోదు. ఆకాశంలో సగం... అవనిలోసగం...జనాభాలో సగమైన మహిళలకు అవకాశాల్లో కూడా సగభాగం కేటాయించాలి. కానీ చాలా రంగాల్లో వీరి పట్ల విపరీతమైన వివక్ష ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సైతం మహిళలు తమ సత్తా చాటుతున్నా....వారి పట్ల ఇంకా చిన్నచూపు. నేడు తెలుగు రాష్ట్రంలోనే బెంగళూరుకు చెందిన సత్యవతి మొట్టమొదటి లోకో పైలెట్‌గా రైల్వేలో సేవలందిస్తుంది. ఈమె 1999లో దక్షిణ మధ్య రైల్వేలో అసిస్టెంట్ రైలు డ్రైవర్‌గా ఉద్యోగం సంపాదించింది. తర్వాత హైదరాబాద్ నగరంలో ఎమ్ఎమ్‌టిఎస్ లోకల్ రైలు "మాతృభూమి లేడీస్ స్పెషల్" కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అయితే ఈ జీవితాలన్నీ చూస్తుంటే మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారు అని చెప్పుకోవడానికి బాగానే ఉన్నా...వాస్తవ పరిస్థితులు చూస్తే ఇంకా ఆడవాళ్లంటే కొన్ని రంగాలకే పరిమితం అనే దృక్పథం మన సమాజంలో పాతుకుపోయి ఉంది. ఇప్పటికీ ఆడపిల్లలంటే ఇంజనీరింగ్, డాక్టర్, లేక టీచర్....హాస్పిటాలిటీ వంటి వృత్తులకే పరిమితం చేస్తున్నారు. నిజానికి సివిల్, మెకానికల్ వంటి రంగాల్లో ఇప్పుడిప్పుడు కొంత మంది మహిళలు అడుగెడుతున్నా వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే వారు మరింత ముందుకు నడవడానికి అవకాశం ఉంటుంది. అయితే చాలా మంది స్త్రీలను ఉద్యోగాల్లో తీసుకుంటే వారికి ఎక్కువ సెలవులు ఇవ్వవలసి వస్తుంది, గర్భం సమయంలో...నెలసరి ఇబ్బందులు అనారోగ్యం కుటుంబబాధ్యతలు వంటి అవసరాలకు ఎక్కువ సెలవులు పెడతారు. వారు ఎక్కువ గంటలు పనిచేయలేరు వంటి అపోహలు మన సమాజంలో బాగా ఉన్నాయి. నిజానికి మహిళలు చాలా ఓర్పుతో...నేర్పుతో పనిచేయగలరు. అందుకే వ్యవసాయ రంగంలో నాట్లు వేయడానికి, కలుపు తీయడానికి కేవలం మహిళల్ని మాత్రమే ఎంచుకుంటారు. అంతేకాదు...మహిళల్లో స్వతహాగా ఉండే సున్నితత్వం.. .నిజాయితీ...అంకిత భావం...లాలిత్యం అన్నవి సమాజానికి చాలా అవసరం. అన్నీ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి. భద్రత కల్పించాలి. అప్పుడు ఉత్పత్తి రంగంలో వారు భాగస్వామ్యం పెరుగుతుంది. దేశం అభివృద్ధిపథం వైపు నడుస్తుంది. యావత్ మహిళాలోకానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో........

- సాంత్వన్

ప్రేమ... విప్లవం...

(భాగం -27) **మార్క్స్, జెన్నీ ప్రేమ కథ**

◆ సీరియల్

"ఇంగ్లండుకు వచ్చిన తొలిరోజుల్లో తను ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు, ప్రతి చిన్న అవసరానికీ ఇతర్ల మీద ఆధారపడవల్సి రావడం వల్ల మార్క్స్‌లో మనుషుల పట్ల కోపం, జుగుప్స పెరిగి వుంటాయి"అంటాడు తాత్వికుడు ఇసయ్యాబెర్లిన్. ఉన్నత స్థానంలో వుండవలసినవాడు, నాయకుడు కావల్సినవాడు, తన ప్రతిభ, పాండిత్యమూ వృధా అయిపోతుందనే నిస్సహాయత అతడిలో ద్వేషాన్ని రగిలించి ఉంటుంది. "జనమంతా తన మీద కుట్ర చేస్తున్నారనే భావన పెరిగిందేమో". మార్క్స్‌ను విమర్శించటానికి, నిందించటానికి ఇవీ కారణాలు. కాని అతణ్ని ఇప్పుడే అణగతొక్కక పోతే, ఎంత ఎత్తుకు ఎదుగుతాడోననే భయం ప్రత్యర్థులకు అతడి మీద బురద చల్లక తప్పని పరిస్థితి కల్పించింది.

1948 తిరుగుబాటులో పాల్గొన్న ఒక మాజీ ప్రష్యన్ అధికారి గుస్తావ్ చెహావ్, కమ్యూనిస్టు లీగ్‌లో చేరాలనే ఉద్దేశంతో, 1850లో మార్క్స్, ఎంగెల్స్‌లను కలిశాడు. "మేధో పరంగా సమున్నతుడు మార్క్స్. మేధస్సూ, హృదయం, ప్రేమ, ద్వేషం కూడా ఆయనలో ఉన్నాయి. నేనంటే తనకు అసహ్యమని అప్పుడప్పుడూ సూచించాడు. అయినా నేను ఆయన కోసం నిప్పుల్లో దూకమంటే దూకేవాణ్ని. నాకు తెలిసిన నాయకత్వ లక్షణాలున్న ఏకైక వ్యక్తి ఆయన. పెద్ద విషయాల గురించి ఆలోచిస్తున్నప్పుడు చిన్న విషయాల గురించి అస్సలు పట్టించుకోడు" అని రాశాడు మార్క్స్ గురించి.

మార్క్స్ మేధో పటిమనూ, బలహీనతల్నీ సరిగానే అంచనా వేశాడు చెహోవ్. అయితే మార్క్స్ ఎప్పుడూ చాలా పెద్ద విషయాల గురించి మాత్రమే ఆలోచించాడు. అందువల్ల మామూలు మనుషుల రోజువారీ విషయాల మీద ఆయనెప్పుడూ దృష్టి పెట్టలేదు. తాను వాటిని విస్మరించడం వల్ల, తన చుట్టూ వున్నవాళ్లు ఏమనుకుంటారో కూడా ఆలోచించలేదు.

"ఈలోగా, అల్లరిచిల్లర వేషాలు కట్టిపెట్టి ప్రమాదకరమైన రాజకీయాలకు స్వస్తిపలికి, ముఖ్యంగా మార్క్స్ సాంగత్యం వదిలి ఇంటికి రావాలని ఎంగెల్స్ మీద ఒత్తిడి పెరిగింది. మార్క్స్ దుష్ప్రభావం నుండి బైటపడాలని వాళ్ల కోరిక. తన రాజకీయ పార్టీ విజయం సాధించేదాకా వ్యాపారం చూసుకొమ్మని అతని సోదరి మారీ సూచించింది. ఎంగెల్స్ తండ్రి, కుమారుడికి మరో సలహా ఇచ్చాడు. "ఈస్టిండియా కంపెనీ, కలకత్తా నుండి జౌళి ఎగుమతులు చేస్తోంది". ఇది లాభసాటి వ్యాపారం. న్యూయార్క్ వెళితే బాగానే ఉంటుందనుకున్నాడు ఎంగెల్స్."

జెన్నీ లండన్‌కు వచ్చిన తెల్లారి ఒక ఇబ్బందికరమైన సంఘటన జరిగింది. ఒక శరణార్థుల సంస్థ, మార్క్స్‌ను తమకున్న అయిదుగురిలో ఒక బోర్డు సభ్యునిగా ఎన్నుకుంది. దీని అర్థం మార్క్స్ ఆ సమావేశానికి హాజరయ్యాడనే. లేదా తన గైర్హాజరీ లోనైనా వాళ్లు తనను ఎన్నుకుని ఉండాలి. అలా జరగదు. హాజరయ్యాడనుకుంటే, తన కుటుంబం పట్ల ఆయనకు శ్రద్ధలేదనే అర్థం వస్తుంది. చాలా ఇక్కట్లు పడి, ఫ్రాన్సు నుండి వచ్చిన భార్యా పిల్లల్ని ఇంటికి తీసుకురావడానికి ఆయన హార్బర్ కెళ్లలేదు. దాని కారణం మంచంపై నుండి లేవలేని అనారోగ్యమన్నాడు. కాని మర్నాడు కమిటీ మీటింగుకు హాజరై, బోర్డుకు ఎన్నుకోబడ్డాడు. ఇది నిజమేననుకున్నా, తన రాజకీయ కార్యకలాపాల కోసం కుటుంబాన్ని ఇంతగా అశ్రద్ధ చేసిన సంఘటన ఇదొక్కటే.

నిజానికి మార్క్స్‌కు భార్యాపిల్లలంటే చాలా ప్రేమ. కాని ఆయన తన ప్రేమను అందరిలా వ్యక్తం చేయడు. జెన్నీ, పిల్లల జీవితాలు అంత దుర్భరంగా గడవటానికి కారణమిదే. తను

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

కలలు గన్న నూతన సమాజ సృష్టికి ఆయన ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడ్డాడు. తను సమూలంగా మార్చాలనుకున్న వ్యవస్థ పట్ల ఆయన క్రూరంగా, నిర్దయగా ఉంటే ఫరవాలేదు. కాని ఆ క్రూరత్వం వ్యక్తిగత జీవితాన్ని కూడా ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం, మార్క్స్ తండ్రి కొడుకు అహంకారాన్ని గురించి చాలా బాధపడ్డాడు. కాని, 'కళ కోసమే బతుకుతాను. కళే నా జీవితం' అనుకునే

కళాకారుడిలాగా ఆ కుటుంబమంతా తన కోసమే బతకాలనుకున్నాడు(వాళ్లు కూడా మార్క్స్ పని ప్రాముఖ్యతను గుర్తించారు). తను చేస్తున్న పని సరైనదనే నమ్మకం, అతణ్ని కుటుంబ అవసరాలను గుర్తించకుండా చేసింది.

మరి జెన్నీ పరిస్థితి ఏమిటి? భర్త లక్ష్యాల పట్ల, ఆశయాల పట్ల ఆమె నిబద్ధత ఎప్పుడైనా తగ్గిందా! ఇంటి బాధలు అనేక సార్లు తనూ, పిల్లలూ మాత్రమే అనుభవించారు. ఆమె అనేక మందికి రాసిన లేఖల్నీ అసంపూర్తి ఆత్మకథనూ మిత్రుల వాంగ్మూలాలనూ పరిశీలిస్తే కనీసం లండన్‌కు వచ్చిన తొలి రోజుల్లో ఆమె నిబద్ధత కించిత్తైనా తగ్గలేదు. సంపన్న కుటుంబం నుండి వచ్చిన పందొమ్మిదవ శతాబ్ది భార్యగా భర్తను సమర్థించడం తప్ప ఆమెకు మరోదారి లేదన్నది స్పష్టమే. భర్త ప్రవర్తన గురించి ఏ చిన్న ఆరోపణ చేసినా, శత్రువుల చేతికి అస్త్రాలిచ్చినట్టే అవుతుంది. అయితే, కేవలం ఈ కారణంతో కాక, మార్క్స్‌ను ఆమె మనస్ఫూర్తిగా సమర్థించి, అతని రాజకీయ కార్యకలాపాలలో పాలుపంచుకున్నది. తన భర్త ఒక అరుదైన జీనియస్ అని ఆమెకు తెలుసు. అతడికి ఎన్ని బలహీనతలున్నా మార్క్స్‌ను ఆమె గాఢంగా ప్రేమించింది. పూర్తిగా నమ్మింది. రొమాంటిక్

“ నిజానికి మార్క్స్‌కు భార్యాపిల్లలంటే చాలా ప్రేమ. కాని ఆయన తన ప్రేమను అందరిలా వ్యక్తం చేయడు. జెన్నీ, పిల్లల జీవితాంతం దుర్భరంగా గడవటానికి కారణమిదే. తను కలలు గన్న నూతన సమాజ సృష్టికి ఆయన ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడ్డాడు. తను సమూలంగా మార్చాలనుకున్న వ్యవస్థ పట్ల ఆయన క్రూరంగా, నిర్దయగా ఉంటే ఫరవాలేదు. కాని ఆ క్రూరత్వం వ్యక్తిగత జీవితాన్ని కూడా ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం, మార్క్స్ తండ్రి కొడుకు అహంకారాన్ని గురించి చాలా బాధపడ్డాడు. కాని, ‘కళ కోసమే బతుకుతాను. కళే నా జీవితం’ అనుకునే కళాకారుడిలాగా ఆ కుటుంబమంతా తన కోసమే బతకాలనుకున్నాడు(వాళ్లు కూడా మార్క్స్ పని ప్రాముఖ్యతను గుర్తించారు). తను చేస్తున్న పని సరైనదనే నమ్మకం, అతణ్ని కుటుంబ అవసరాలను గుర్తించకుండా చేసింది.”



ఆంటోని పనిజీ

హీరోగా ఊహించుకుని అతడితో ప్రేమలో పడింది. సమాజాన్ని, కుటుంబాన్ని ధిక్కరించి పెళ్లి చేసుకుంది. అతడి జీవిత లక్ష్యం తన లక్ష్యమనుకుంది. తన కష్టాలను ఏకరువు పెట్టిన వైడెమియర్‌కు రాసిన ఉత్తరంలో కూడా. “ఈ కష్టాల వల్ల నేను కుంగిపోతున్నాననుకోకండి. మాది ఒంటరి పోరాటం కాదని నాకు తెలుసు. నా భర్త, నా జీవితభాగస్వామి ఎప్పుడూ నా వెన్నంటే ఉన్నందుకు తృప్తిగా, ఆనందంగా ఉంది”. ఆమె కోపమంతా మార్క్స్‌కు ద్రోహం చేసినవాళ్ల మీద. అయితే అధికార వర్గాల గురించి ఆయన వ్యాఖ్యలు చేసినప్పుడు మాత్రం మౌనం వహించింది. ఆమెది కఠిన జీవితం. చాలా జీవితాలకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ కఠినమైనది. అయితే ఇందుకు ఆమె మార్క్స్‌ను నిందించలేదు. అతడి ప్రేమాభిమానాలను, తన పట్ల నిజాయితీని మాత్రమే ఆమె ఆశించింది.

లండన్ వచ్చిన తొలి రోజుల్లో ఆమె కాస్త బెదిరినట్టు కనిపించినా, ధైర్యం సడలలేదు. భవిష్యత్తులోకి తొంగి చూడగలిగినా, నిత్యం ఎదురీదిన రాజకీయ, ఆర్థిక సుడిగుండాలలో కూడా ఏమాత్రం తొణకకుండా ప్రతి క్షణం భర్తపక్కనే నిలిచింది. కాని ఆమె ఎదుర్కోబోతున్న అసలు విషాదం రాజకీయమూ, ఆర్థికమూ కాదు వ్యక్తిగతం.

జాల్ట్‌బామెల్, హాలెండ్, ఆగస్టు 1850

కాఫీబ్యాగులు, టీ బాక్సులు, చేపల టిన్నులు ఆయిల్ బాటిళ్ల మీద ఆధారపడిన ఈ ప్రశాంతతను చూస్తుంటే, ఒక దివిటీ తీసుకుని ఈ దేశాన్ని తగలబెట్టాలనిపిస్తోంది

– జెన్నీమార్క్స్.

1850 జూన్‌లో వేసవి వుక్క భరించలేకుండా ఉన్నప్పుడు ఒక చల్లని విడిదిని వెదుక్కున్నాడు మార్క్స్. అతి ముఖ్యమైన ఒక పరిశోధన చేస్తున్నానని బ్రిటిష్ మ్యూజియం రీడింగ్ రూం సిబ్బందిని ఒప్పించి పాఠకుడిగా లోపలికి ప్రవేశించేందుకు అనుమతి(రీడర్స్ టికెట్) తీసుకున్నాడు. ఆనాటి నుండి జీవితాంతం అదే అతనికి శరణాలయం. పరిశోధనా కేంద్రం.

ఇప్పుడు ఈ రీడింగ్ రూం ఒక వృత్తాకార హర్మ్యం. కాని 1850లో అది పొడవాటి బల్లలతో, గోడకు నిలువెత్తు అల్మరాలలో పెట్టిన పుస్తకాల దొంతరలతో దర్శన మిచ్చిన ఒక సాధారణ భవనం. ఆ రీడింగ్ రూం అధికారి 1823లో ఇంగ్లండుకు వలసవచ్చిన ఒక ఇటాలియన్. పేరు ఆంటొనీ పనిజీ. 1850నాటికి కష్టపడి పైకొచ్చి ఆ గ్రంథాలయానికి “కీపర్ ఆఫ్ ప్రింటెడ్ బుక్స్” హోదాలో కొనసాగుతున్నాడు.

రాజకీయ చర్చోప చర్చల నుండి, లండన్ వీధుల ధూళి నుండి, ఇంటి సమస్యల నుండి దూరంగా ఇక్కడ కూర్చోవడం మార్క్స్‌కు ఎంతో కొంత మంచి చేసిందనటంలో సందేహం లేదు. మ్యూజియం వాతావరణం అతనిలో కొత్త ఉత్సాహం నింపింది. జీవితంలో అతనికి అత్యంత ఇష్టమైన పని అధ్యయనం.

నిజానికి అప్పుడు కూడా కాస్త అసంతోషంగా ఉన్నాడంటే కారణం...కాలమంతా అక్కడ గడపలేకపోవడమే. గడపలేకపోవడానికి కారణం కూడా స్పష్టమే. అప్పులు. జులై చివరన తిరిగిస్తానని ఒక లండన్ వ్యాపారి దగ్గర ఇరవై పౌండ్లకు ప్రామిసరీ నోటు మీద సంతకం పెట్టాడు. గడువు దగ్గరపడింది. కాని డబ్బులేదు. పారిస్‌లో ఉన్న తన మిత్రుడు కార్ల్‌బ్లైండ్‌ను సహాయం చెయ్యమని రాశాడు. అప్పు తీర్చలేక పోతే నా గురించి ఎంత దుష్ప్రచారం జరుగుతుందో నీకు తెలుసు. ఈ విషయం ప్రష్యన్, బ్రిటిష్ అధికారుల దృష్టికిపోతే ఏమవుతుందో ఊహించగలం. ఫలితం ఏమైందో తెలియదు కాని, ఒక వేళ బ్లైండ్ పంపినా తీర్చవలసిన అప్పుల్లో అది ఏపాటి! ప్రచురించటానికి పుస్తకాలు లేవు. డబ్బువచ్చే మరే పనీ చెయ్యడం లేదు. హాలండ్‌లో ఉన్న అంకుల్ తప్ప తనను ఆదుకునే వాళ్లెవరూ కనిపించడం లేదు.

ఈలోగా, అల్లరిచిల్లర వేషాలు కట్టిపెట్టి ప్రమాదకరమైన రాజకీయాలకు స్వస్తిపలికి, ముఖ్యంగా మార్క్స్ సాంగత్యం వదిలి ఇంటికి రావాలని ఎంగెల్స్ మీద ఒత్తిడి పెరిగింది. మార్క్స్ దుష్ప్రభావం నుండి బైటపడాలని వాళ్ల కోరిక. తన రాజకీయ పార్టీ విజయం సాధించేదాకా వ్యాపారం చూసుకొమ్మని అతని సోదరి మారీ సూచించింది. ఎంగెల్స్ తండ్రి, కుమారుడికి మరో సలహా ఇచ్చాడు.

ఐజాహ్ బెర్లిన్

"ఈస్టిండియా కంపెనీ, కలకత్తా నుండి జౌళి ఎగుమతులు చేస్తోంది". ఇది లాభసాటి వ్యాపారం. న్యూయార్క్ వెళితే బాగానే ఉంటుందనుకున్నాడు ఎంగెల్స్. అక్కడికైతే, మార్క్స్‌ను కూడా వెంట రమ్మనవచ్చు. కానీ ఈ రెండింటిలో ఏదీ జరగలేదు. లండన్‌లో పరిస్థితులు చేయి దాటిపోతున్నాయి. కూలీ దొరకని శరణార్థులతో వీధులు కిటకిటలాడుతున్నాయి. అనేక మంది రచయితలు పత్రికలు ప్రారంభించడానికీ, విదేశాలలో తమ రచనలు అమ్ముకోటానికీ ప్రయత్నిస్తున్నారు. చివరికి తండ్రి కాటన్‌మిల్లులో పనిచెయ్యటమే సరైన నిర్ణయమనుకున్నాడు ఎంగెల్స్. అలా చెయ్యడం వల్ల "మార్క్స్‌కు కూడా ఆర్థికంగా సహాయపడవచ్చు. "అంతా అనుకున్నట్టుగా జరిగితే, ఇంత వరకు కనీవినీ ఎరుగని సంచలనాత్మకమైన పొలిటికల్ ఎకానమీ పుస్తకం రాస్తాడు మార్క్స్. అది తప్పక కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేసి విప్లవానికి సహాయం చేస్తుంది" అన్న విశ్వాసం కూడా ఉంది. మార్క్స్ కూడా తను అలాంటి దశలోనే ఉన్నాననుకున్నాడు. కాకపోతే సమయం పడుతుంది. అంటే ఈ లోగా డబ్బుకావాలి. అప్పటి వరకు ఇద్దర్లో ఎక్కువ సక్సెస్ ఫుల్ రచయిత ఎంగెల్స్..కవిగా, జర్నలిస్టుగా మంచి పేరుంది. కాని అతనికి మార్క్స్ పట్ల ఎంత గౌరవమంటే స్వచ్ఛందంగా తన రచనా వ్యాసంగానికి విరామం ఇచ్చి తన మిత్రుడి గ్రంథరచనకు వీలైనంత సహాయం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

కొడుకు కాటన్ మిల్లుకు వస్తున్న అసలు కారణం ఎంగెల్స్ తండ్రికి తెలియదు. కారణమేదైతేనేం వచ్చాడు, అంతేచాలు అనుకున్నాడు. జౌళి వ్యాపారంలో పోటీ తీవ్రంగా ఉంది. వ్యాపారంలోని వాటాదారులు మీద ఓ కన్నేసి ఉంచడానికి తన మనిషొకడు మాంచెస్టర్‌లో ఉండాలి. అప్పటికి ఎంగెల్స్ వయస్సు 30 ఏళ్లు. ఏడాదికి 200 డాలర్ల జీతం. వ్యాపార నిమిత్తమైన ఖర్చులకూ, వినోదానికీ అదనంగా చెల్లిస్తారు. అప్పటి జీతాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువ. అయితే మార్క్స్‌కి తక్షణ సమస్య, తీర్చవలసిన అప్పులు చాలా ఉన్నాయి. ఎంగెల్స్ మొదటి జీతం తీసుకున్న దాకా అవి ఆగవు.

ఎంగెల్స్ ప్రేరణతో కాబోలు, తను కూడా ఏదైనా చెయ్యాలనుకుంది జెన్నీ. హాలండ్‌లోని జాక్ట్ బామెల్‌కు వెళ్లి 'కార్ల్ అంకుల్' తో మాట్లాడితే ఫలితముండొచ్చు. ఎలాగైనా, భర్తను ఈ ఆర్థిక సమస్యలు వేధించకుండా చూడాలి. భవిష్యత్తు గురించి కొద్దిగా ఆందోళన కూడా ఉన్నది. ఇప్పుడామె మళ్లీ గర్భవతి.

హాలండ్ నుండి తన ప్రయాణం గురించి మార్క్స్‌కు ఇలా రాసింది. "కుదుపులతో, భరించలేని సీ సిక్‌నెస్‌తో పదిహేను గంటలు సముద్రం మీద గడిపాను". ఇంటికి వచ్చిన జెన్నీని లయన్ ఫిలిప్ కాసేపటికి గుర్తుపట్టి, అయిష్టంగానే లోపలికి రమ్మన్నాడు(బడలికతో, అనారోగ్యంతో ఫిలిప్‌కు ఆమెను పోల్చుకోవడం కష్టమైంది). ఇంట్లో ఆడవాళ్లెవరూ లేరు. ఆమె ఉన్నప్పుడు వాళ్లు తిరిగిరారని తెలిసింది. ఇక, విషయం త్వరగా తేల్చుకోవాలని, వారసత్వంలో మార్క్స్ వాటా లభించని పక్షంలో అమెరికాకు వెళ్లకతప్పదని చెప్పింది. ఆశ్చర్యంగా "అలాచేస్తే బాగానే ఉంటుంది" అన్నాడతడు. కాని దానికీ డబ్బు కావాలని స్పష్టం చేసిందిక. అప్పుడు ఫిలిప్ నొచ్చుకుని తమ కృషిని వ్యతిరేకిస్తూ "తనూ, తన పిల్లలూ 1848 తిరుగుబాట్ల వల్ల చాలా నష్టపోయారని" చెప్పాడు.

"వచ్చిన పని కాలేదు. ఎంత ప్రయత్నించినా, ఎన్ని విధాలుగా చెప్పినా ఆయన వినలేదు. సాయంత్రం గుండె రాయి చేసుకుని, ఏడుస్తూ పడుకున్నాను. డియర్ కార్ల్ ప్రయత్నం వృథా అయింది. తిరుగు ప్రయాణ ఖర్చులు కూడా రాబట్టలేకపోయాను. నిన్నటి నుండీ ఎంత కుమిలిపోయానో నాకు తెలుసు. నా బాధను మాటల్లో చెప్పలేను.

లావా లాగా పొంగి వచ్చిన కోపంతో "కాఫీ బ్యాగులు, టీ బాక్సులు, చేపల టిన్నులు, ఆయిల్ బాటిళ్ల మీద ఆధారపడిన ఈ ప్రశాంతతను సుఖజీవితాన్ని చూస్తుంటే, ఒక దివిటీ తీసుకుని ఈ దేశాన్ని తగలబెట్టాలిపిస్తోంది" అంటూ రాసింది. ఇంతకన్నా అవమానం ఏం కావాలి! కుటుంబం చేత తిరస్కరించబడిన ముష్టిదితాను. అయినా భర్తను నిందించలేదు. "అనుకున్నది సాధించలేక నిస్సహాయంగా తిరిగివస్తున్నాను. మోసపోయాను. అవమానానికి, తృణీకారానికి గురయ్యాను. నిన్ను, పిల్లల్నీ చూడాలని నా అణువణువూ పరితపిస్తున్నది. పిల్లల్ని చూడగానే నా కళ్లు కన్నీటి చెలమలు కాకుండా జాగ్రత్త పడాలి. నా తరపున పిల్లల్ని ముద్దులతో ముంచెయ్యి. నువ్వూ, లెంచెన్ వాళ్లను కంటికి రెప్పలా చూసుకుంటారని నాకు తెలుసు. లెంచెన్ లేకుండా నేనిక్కడ సుఖంగా వుండలేను. త్వరలో కలుద్దాం. కార్ల్ ఆఫ్ మై హార్ట్".

సశేషం

▪ ఫోన్: 91776 18708



ఈ చిన్నోడెవరో?

ఎంతో...అమాయకంగా కనిపిస్తు ఈ బాల నటుడు ఎవరో తెల్సా? ఎక్కడో చూసినట్టనిపిస్తోందా? కానీ చెప్పలేకపోతున్నారా? అయితే క్లూ ఇవ్వాల్సిందే. ఇప్పడీయన జాతీయ నటుడిగా పేరు సంపాదించుకున్నాడు. ఒకే సినిమాలో పదేసి పాత్రలు పోషించడంలో దిట్ట. ఏంటీ... ఇప్పుడు తెల్సిపోయిందా? కానీ మీ సమాధానం సరైనదో కాదో తెలియాలంటే... 24వ పేజీ చూడండి.

రుచి

ఇంకా మార్చి నెల మొదట్లోనే ఉన్నాం. అప్పుడే ఎండ బాధలు మొదలయ్యాయి. మరి ఈ ఉష్ణాన్ని తట్టుకోవడానికి చల్లని పానీయాలు... పండ్లతో తయారుచేసిన సలాడ్స్ వంటివి తీసుకుంటే మంచిది. మరి వాటి తయారి గురించి తెలుసుకుందాం !

బనానా ఐస్ ఫ్రూట్

కావలసినవి : అరటిపండ్లు–4, పంచదార–అరకప్పు: పాలు–2కప్పులు, తాజా ఐస్‌క్రీమ్ : తగినంత, వెనిలా ఎసెన్స్ – టేబుల్ స్పూను, మౌల్డ్స్–4

తయారీ : అరటిపండ్లను ముక్కలుగా కట్ చేయాలి. మిక్సీలో అరటిపండు ముక్కలు, పాలు, ఐస్ క్రీమ్, వెనిలా ఎసెన్స్ వేసి నాలుగైదు నిమిషాలు ఆడించాలి. అన్నీ బాగా కలిసి చిక్కటి మిశ్రమం తయారవుతుంది.

మౌల్డ్స్‌లో ఈ మిశ్రమం పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. నాలుగైదు గంటల తర్వాత బయటకు తీస్తే బనానా ఐస్ ఫ్రూట్ రెడీ అయినట్లే.

ఫ్రూట్ మిక్స్

కావల్సినవి: కాచిన పాలు –కప్పు, అరటిపండు–ఒకటి, సపోటాలు–నాలుగు, బత్తాయిలు– రెండు(రసం తీసుకోవాలి), జీడిపప్పు, బాదం–పది చొప్పున (ముందుగానే నానబెట్టుకోవాలి), తేనె– ఎనిమిది చెంచాలు, వెనిల్లా ఎసెన్స్ – రెండు చుక్కలు, వెనిలా ఐస్‌క్రీం–సరిపడా

తయారీ :

అరటిపండ్లు , యాపిల్ సపోటాలను చిన్నచిన్న ముక్కల్లా చేసుకుని మిక్సీలో వేసుకోవాలి. ఆ తరువాత పాలుచేర్చి మరోసారి మిక్సీలో తిప్పాలి. నానిన జీడిపప్పు, బాదంపలుకుల్లో సగం తీసుకుని విడిగా మెత్తని మిశ్రమంలా చేసి అరటిపండు జ్యూస్‌కి కలపాలి. అందులో తేనె, బత్తాయి రసం, వెనిలా ఎసెన్సు వేయాలి. ఆ మిశ్రమాన్ని గ్లాసులో ముప్పావు వంతు తీసుకోవాలి. పైన ఐస్ క్రీం వేసి మిగిలిన బాదం, జీడిపప్పు పలుకులు చేర్చి అలంకరిస్తే సరిపోతుంది. పసందైన పానీయం తయారైనట్టే. ఫ్రూట్ మిక్స్ తీసుకుంటే రుచికి రుచి... ఆరోగ్యానికి ఆరోగ్యం రెండూ లభిస్తాయి.

ఆరెంజ్ స్క్వాష్

కావలసినవి :

నారింజ పళ్లు –12, పంచదార–అరకిలో, నారింజ ఎసెన్స్–2 లేదా 3 చుక్కలు, నారింజ రంగు పొడి–రెండు చిటికెలు.

తయారీ :

నారింజ పై తోలును తీసివేసి వాటిని ఒక మిక్సీలో వేసి గ్రైండ్ చేయండి.

పంచదార పాకం పట్టి అందులో కొంచెం నిమ్మరసాం వేసి కలపండి. ఈ పాకం చల్లబడ్డాక అందులో నారింజ మిశ్రమం, ఎసెన్స్ చుక్కలు, చిటికెడు రంగు వేసి కలిపి, దాన్ని కాసేపు ఫ్రిడ్జ్‌లో పెట్టండి. కొంచెం సేపు తర్వాత నారింజ స్క్వాష్ గ్లాసుల్లో పోసి ఇంట్లోఉన్న వారందరికీ అందించండి. వారితో పాటూ మీరూ హాయిగా తాగేయండి.

కొత్తగా ఫ్రూట్ సలాడ్

కావల్సినవి :స్ట్రాబెర్రీ, యాపిల్, కమలాఫలం, బత్తాయి, కివీ–ఒక్కొక్కటి చొప్పున, నానబెట్టిన బాదం– పది, ఖర్జూరాలు– పది, ఎండుద్రాక్ష–టేబుల్ స్పూను, అరటిపండ్లు–రెండు, థాయ్‌లిచ్చీ–ఒక గుత్తి, పాలు –లీటరు, పంచదార– రెండు కప్పులు, బియ్యం– మూడు టేబుల్ స్పూన్లు, యాలకులు–నాలుగు

తయారీ :పాలు సగం అయ్యేదాకా బాగా మరిగించాలి. ఇంతలో బియ్యాన్ని దోరగా వేయించి, చల్లారాక యాలకులతో కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పిండి, పంచదారను మరిగిన పాలల్లో వేసి బాగా కలిపితే చిక్కగా అవుతుంది. ఒక నిమిషం తర్వాత పొయ్యి మీద నుండి దింపేయాలి. ఇది చల్లారేలోగా పండ్లను సన్నగా ముక్కలుగా తరిగి, పాల మిశ్రమంలో చేర్చాలి. చివరిగా మిగిలిన పదార్థాలన్నీ కలిపి ఓ రెండు గంటలు ఫ్రిజ్ లో ఉంచితే సరిపోతుంది. నోరూరించే సలాడ్ సిద్ధం అయినట్లే.

చుక్కల్ని కలపండి

మంచి పద్యం

కనకపు సింహాసనమున
శనకము కూర్చుండబెట్టి శుభలగ్నమున
దొనరగ బట్టముగట్టిన
వెనుకటిగుణమేల మాను వినరా సుమతీ!

తాత్పర్యం : కుక్కను తెచ్చి మంచి ముహూర్తం చూసి బంగారు సింహాసనంపై కూర్చోబెట్టి పట్టాభిషేకం చేసినా, దాని బుద్ధి ఏలా మారదో అలా చెడ్డవానికి మంచి పదవిని ఇచ్చి ఎంత గౌరవంగా చూసినా వాడు తన చెడు బుద్ధిని వదలడు.



బొమ్మ గీద్దామా!

పై చిత్రంలో గళ్లలో దాక్కున్న పిల్లిని చూసారా. పక్కనున్న గళ్లలో కూడా అచ్చు అలాగే...ఒక్క గడి కూడా తప్పకుండా అలాగే బొమ్మను గీయండి చూద్దాం.

తెలుగు పద కేళి

ఈ చిత్రంలో ఇచ్చిన తెలుగు పదాలన్నింటికీ "పా"తో మొదలై "ము" ముగిసే అర్థం వచ్చే పదాలతో గళ్లను నింపండి.

1	జలము	పా	నీ	య	ము
2	వస్త్రము	పా			ము
3	పవిత్రము	పా			ము
4	నైపుణ్యము	పా			ము
5	ఒక పక్షి	పా			ము
6	బోధించుట	పా			ము
7	పాదరసము	పా			ము
8	పరమాన్నము	పా			ము
9	మహాపాపము	పా			ము
10	కిందిలోకము	పా			ము

ముక్కులోకి దారేది?

ఈ చిత్రంలో కనిపిస్తున్న భేతాలుడి ముక్కులోని ఒక నాసికా రంధ్రంలో నుండి మరో రంధ్రంలోకి వెళ్లడానికి దారి కనుక్కోండి.

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా గున్నా...అందులో చాలా తేడాలున్నాయి. వాటిలో ఆరు తేడాలను గుర్తించండి.

పొడుపు విప్పండి చూద్దాం!

1. అమ్మ తమ్ముడ్ని కాదు కానీ నీకు మేన మామని. నేను ఎవరో చెప్పుకోండి?
2. ఆకులేయదు. నీరు తాగదు. నేలన పాకదు. ఏమిటా తీగ?
3. ఒక్కొక్క అడుగు పోయిన కొద్దీ తోక కొంచెం తగ్గుతుంటుంది...ఏమిటది?
4. చింపిరి చింపిరి గుడ్డలు...రత్నాల్లాంటి బిడ్డలు ఏవరో వారు?
5. రాజుగారి తోటలో బోలెడన్ని పూలు. వాటిని చూసేవారే కానీ కోసేవారే లేరు. ఏమిటో ఆ పూలు?
6. తొండమున్నా ఏనుగు కాదు. రెక్కలున్నా పక్షి కాదు. ఆరు కాళ్లున్నా చీమ కాదు....గుర్తుపట్టండి చూద్దాం.

జవాబులు : 1. చందమామ 2. కరెంటు తీగ 3. సూదీదారం 4. మొక్కజొన్న పొత్తు. 5. నక్షత్రాలు 6. సీతాకోక చిలుక

నచ్చిన రంగుల్లో ఐస్‌క్రీం

చల్ల చల్లని హిమక్రీము నోరూరిస్తుంది కదూ! అయితే ఇది వెనిలా, పుడ్డింగ్, స్ట్రాబెర్రీ, చాకోలెట్... వాటిల్లో ఏప్లేవరో మరి. కానీ సాసర్‌లో మాత్రం తింటానికి సిద్ధంగా ఉంది. మరి ఇంకెందుకు ఆలస్యం వాటికి చక్కటి రంగులు దిద్ది, చూడముచ్చటగా తీర్చిదిద్దండి. ఐస్‌క్రీంపై మీకున్న మక్కువను చాటుకోండి.



రాయలు వారి కల

శ్రీకృష్ణ దేవరాయలకు ఒకరోజు కలలో అందమైన భవనం కనిపించింది. ఆ భవనం ఆకాశంలో తేలుతూ, లక్షదీపాలతో చాలా అద్భుతంగా ఉంది. తలుచుకుంటే చాలు మాయమైపోయే ఆ భవనాన్ని కలలో చూసిన రాయలు దాని అందానికి ముగ్ధుడయ్యాడు. తెల్లారింది. నిద్రలేచాడు. అయినా ఆ కలలో కనిపించిన భవనమే కళ్లముందు కదులాడుతోంది. దాన్ని మర్చిపోలేక పోయాడు. మర్నాడు సభలో తనకు కలలో కనిపించిన భవనం గురించి వివరించి దాన్ని నిజం చేయాలన్న ఆయన నిర్ణయాన్ని అందరికీ తెలియజేశాడు. అది విన్న వారంతా గాలిలో తేలాడే భవనాన్ని ఎలా నిర్మించగలం...అసలు గాల్లో తేలే కట్టడాలు ఉంటాయా. అది అసాధ్యం కదా! అని తలలు పట్టుకున్నారు. కొందరు సాహసం చేసి ఇది అసాధ్యం ప్రభు అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ రాయలు వారు మాత్రం వారి మాటలు వినలేదు. పైగా కోపగించారు కూడా. అంతేకాదు నా కల నిజం చేసిన వారికి లక్ష వరహాల బహుమతిని అందచేస్తాననీ ప్రకటించారు.

ఒకరోజు సభకొక వృద్ధుడు వచ్చాడు. నెరిసిన గడ్డం, జుత్తు, మీసాలతో...అతి కష్టం మీద కర్రతో నడుచుకుంటూ వచ్చాడు. నాకు అన్యాయం జరిగింది. న్యాయం చేయండి అని దేవరాయలును వేడుకున్నాడు ఆ ముదుసలి.

"మీకు జరిగిన అన్యాయం గురించి చెప్పండి. తప్పక న్యాయం చేస్తాం" అని మాటిచ్చారు ప్రభువులు.

"మహారాజా! నా దగ్గర నూరు నాణ్యాలున్నాయి. అవి ఒకరు దొంగలించారు. నాకు వారెవరో తెలుసు. వారి వద్దనుండి నా నాణ్యాల్ని నాకు ఇప్పించండని" అర్థించాడు.

ఆ మాటలు విన్న శ్రీకృష్ణ దేవరాయలు దొంగ ఎవరో చెప్పమని అడిగారు. చెప్పడానికి సంకోచించాడు వృద్ధుడు. అది గమనించిన ప్రభువులు "మీకేం భయంలేదు. నిరభ్యంతరంగా చెప్పండని" సెలవిచ్చాడు.

"నా సొమ్ము దొంగిలించింది మీరే స్వామీ! నిన్న రాత్రి కలలో ఈ సంఘటన జరిగింది" చెప్పాడు.

ముసలి వ్యక్తి మాటలు విన్న రాయలు వారు అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. "మాతోనే పరిహాసాలా" అని గుడ్లు ఉరిమాడు.

ఆ మాటలకు వృద్ధుడు వెంటనే తన నెరిసిన గడ్డం, మీసం అన్నీ తీసి...తన పగటి వేషాన్ని బయటపెట్టాడు. చూస్తే అతనెవరో కాదు తెనాలి రామకృష్ణుడు.

"క్షమించండి స్వామి...మీ కలను నిజం చేయడం ఎంత కష్టమో నిరూపించడానికే ఇలా చేసాను" అన్నాడు తెనాలి. ఇంత చాకచక్యంగా విషయాన్ని అర్థమయ్యే విధంగా చెప్పిన తెనాలి రామకృష్ణుని అభినందించాడు శ్రీకృష్ణ దేవరాయలు.

✦

వ్యవసాయ సంక్షోభం ఏందుకో స్పష్టమవుతుంది

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతుల వల్ల ఎరువుల కంపెనీలు, పురుగుమందుల కంపెనీలు బాగుపడుతున్నాయి. వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకుంటూ రైతన్నలను అప్పుల ఊబిలోకి నెట్టుతోంది. ఈ పరిస్థితి మారాలి. మన వ్యవసాయ రంగం నిలదొక్కుకోవాలంటే గతంలో మన పెద్దలనుసరించిన ఉమ్మడి ఆలోచనా విధానాన్ని మన రైతులు పాటించాలి. ఒక గ్రామంలోని రైతులు, తమ ఉమ్మడి, ఆలోచన పరస్పరం పంచుకున్న విజ్ఞానం మీద ఆధారపడి నిర్ణయాలు తీసుకోవాలి. అలా కాకుండా ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవు. ఈ చిన్న పుస్తకంలో మంచి వ్యవసాయ భూములు బీడు భూములుగా ఎలా మారిపోతున్నాయో వివరించడం జరిగింది. గతంలో మాదిరిగా సమిష్టి వ్యవసాయ దిశగా మన రైతాంగం ఆలోచన కదలాలి. ప్రస్తుత వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని నివారించేందుకు అవలంభించాల్సిన పద్ధతులను చక్కటి సమాచారం దానితోపాటు బొమ్మలతో "నా పొలంలో ఏ పంటయినా పండదెందుకని ?" పుస్తక రూపంలో తేవడం ప్రజా ప్రయోజనకరం.



'నా పొలంలో ఏ పంటయినా పండదెందుకని ?"
రచయిత: డాక్టర్ఇ.ఆర్. సుబ్రమ ణ్యం
పేజీలు : 39
వెల : 20 రూపాయలు
ప్రతులకు:ప్రజాశక్తిఅన్నీ బ్రాంచీలు

చీడపీడల నుండి విముక్తి కోసం



సమగ్ర చీటపీడల యాజమాన్యం వైపుగా...
రచయిత : డాక్టర్ ఇ.ఆర్. సుబ్రమణ్యం
పేజీలు : 39
వెల : 20 రూపాయలు
ప్రతులకు : ప్రజాశక్తి అన్నీ బ్రాంచీలు

గత కొన్ని దశాబ్దాలుగా రసాయన కీటక నాశినులు వాడకం ఎక్కువైంది. ఇవి అనేక మార్గాల ద్వారా తల్లిపాలలోనే కాకుండా, గర్భాశయంలోకి వెళ్లి గర్భస్థ శిశువుల్ని కూడా బలిపెడుతున్నాయి. ఈ కీటక నాశినుల్లో కొన్ని అత్యంత ప్రమాదకరమైనవని గుర్తించినా వాటిల్లో కొన్నింటిని మాత్రమే నిషేధించారు. కీటకనాశినుల వాడకం ఆ వ్యాపారం సాగించే వారికి తప్ప మిగతావారందరికీ అనర్థాలను తెచ్చిపెడుతుంది. రైతు ఆర్థిక స్థితినీ, ఇటు వాతావరణాన్నీ, రైతు కూలీని, వినియోగదారునీ, పంటనూ దేన్నీ నష్టపరచకుండా అవసరమైనప్పుడు ఇతర పద్ధతులతో కలిపి కీటక నాశినులను వాడాలి. పరిశోధనల ప్రకారం, పురుగు జనాభా నష్టం కలిగించే స్థాయిలో ఉంటేనే మందు చల్లాలి వంటి విషయాలను ఈ పుస్తకంలో క్రోడీకరించారు.

ఈ పుస్తకం ప్రధాన లక్ష్యం ఏమంటే మనం, రసాయన, పురుగుమందుల అనవసర వినియోగం నుండి విముక్తి కావడమే. 'సమగ్ర సస్యరక్షణ'అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్న ఉత్తమమైన పద్ధతి. పంట అంచనాలను, పురుగుస్థాయినీ, నియంత్రణావసరాలు, మార్గాలు, పురుగుల సహజ జీవితచక్రం అన్నింటినీ బేరీజు వేసుకుని పురుగు పంటకు నష్టం కలిగించని స్థాయిలో ఉంచుతుంది. కీటకాలపై యుద్ధం విజయవంతం కావాలంటే ఈ శాస్త్రీయమైన విధానమే శరణ్యం. ప్రస్తుత రసాయన నియంత్రణ నుంచి ఉత్తమమైన ఈ విధానం వైపు మన రైతాంగం కదలాలి. అదే ఈ చిన్న పుస్తకంలో చర్చించడం జరిగింది.



ప్రపంచీకరణ- భారతదేశం
రచయిత : ప్రభాత్ పట్నాయక్
పేజీలు : 352
వెల : 200 రూపాయలు
ప్రతులకు : ప్రజాశక్తి అన్నీ బ్రాంచీలు



ప్రపంచీకరణ–సంస్కృతి
రచయిత : తెలకపల్లి రవి
పేజీలు : 175/-
వెల : 200 రూపాయలు
ప్రతులకు : ప్రజాశక్తి అన్నీ బ్రాంచీలు

లిటిల్ స్టార్ జవాబు కమల్ హాసన్

కండల రాణి

"కండలు పెంచడం, బరువులు ఎత్తడం, పోటీల్లో పాల్గొనడం ... వంటివన్నీ మగాళ్లకే. ఆడాళ్లకవి నప్పవు. సహజసిద్ధమైన అందానికి దూరం కావాల్సి వుంటుంది" అనుకుంటారు కొందరు. మరి మీ ఎదురుగా వున్న ఫొటోలను చూస్తే ఏమనిపిస్తుంది? అదంతా ఉత్తుత్తి అనుమానాలే అని తెలీడం లేదూ! అందాల కండల రాణి పేరు టొమొకో కాండ. వయసు 48 సంవత్సరాలు. జపాన్‌లోని ఒసాకాలో నివాసం. ఈ వయసులో అంత చక్కని శరీర సౌష్టవాన్ని ప్రదర్శించడం చిన్న విషయం కాదు. అందుకు కఠోర శ్రమ, సాధన, పట్టుదల వుండాలి. అవన్నీ పుష్కలంగా వున్నాయి కనకే టొమొకో అనుకున్నది సాధించగలిగింది. మొదటిసారిగా బాడీ బిల్డింగ్ గురించి ఆలోచన వచ్చినప్పుడు ఆమె వయసు 23. బాగా లేటు వయసు. కానీ పట్టుదలతో అనుభవజ్ఞులైన గురువుల దగ్గర చేరి శిక్షణ మొదలెట్టింది. తను అనుకున్న పద్ధతుల్లో శరీరాన్ని మలచుకున్న తర్వాత...అందరూ ఒకటే సలహా ఇవ్వనారంభించారు. పోటీల్లో ఎందుకు పాల్గొనకూడదూ? అని. మొదట్లో వద్దనుకున్నా... జపాన్‌లో జరిగే పోటీల్లో మాత్రమే పాల్గొనాలని నిర్ణయించుకుంది. 2002లో మొదటిసారిగా బాడీ బిల్డర్లతో పోటీ పడింది. తర్వాత ఇక ఆగిందే లేదు. ఎన్నో అవార్డులు, గుర్తింపులు, బహుమతులు...వరించాయి. వరిస్తూనే వున్నాయి. మంచి ఆహారం, వ్యాయామం రెండూ ముఖ్యమైనవంటోంది టొమొకో. ఇప్పటి వరకు ఏ ఒక్క రోజు కూడా వ్యాయామం చేయడం ఆపలేదు. ప్రతి రోజూ జిమ్‌కెళుతుంది. సోయా పాలతో దైనందిన కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. పీచు పదార్థాలను ఎక్కువగా తీసుకుంటుంది. ఇక ఈమె టైమ్‌టేబుల్‌లో వ్యాయామం, తిండి ఇవే వుంటాయనుకుంటే పొరపాటే. అందాన్ని మెరుగులు దిద్దుకోవడానికి కూడా సమయం కేటాయిస్తుంటుంది. ●

వావ్... ఒయాసిస్

"ఎడారిలో ఒయాసిస్ గురించి వినడమే కాని చూడలేదే" అన్న బాధ అవసరం లేదు. అలాంటి అందాల ఒయాసిస్సే మీ ముందుకు వచ్చింది. చూశారుగా! ఇది పెరూలో ఉంది. ఉప్పునీటి మడుగులు, ఈత చెట్లు, క్రోటన్ మొక్కలు, హోటళ్లు, అంగళ్లు, గ్రంథాలయం వంటి సకల సౌకర్యాలతో బంగారంలా మెరిసిపోయే ఇసుకతో ఈ ప్రాంతం అలరారుతోంది. ప్రత్యేకమైన ఉష్ణోగ్రత, పొడి వాతావరణం, కొద్దిపాటి వర్షాలు ... చూడాల్సిందే కాని మాటల్లో చెప్పలేం. అక్కడకు చేరుకున్న టూరిస్టులు ఇసుక మేడల మీదగా ఉదయించే భానుణ్ని, అస్తమించే సూర్యుడ్ని చూసి మైమరచిపోతుంటారు. అన్నట్లు ఇక్కడ 96 ఇళ్లు ఉన్నాయి. స్థానికులే షాపులు నడుపుతుంటారు. ఈ ప్రాంతానికి జాతీయ సాంస్కృతిక వారసత్వ సంపదగా కూడా గుర్తింపు ఉంది. ●